సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
బుధవారం, 29.04.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 187
పేజీలు: 12 వెల: రూ. 5

నైపుణ్య శిక్షణ ద్వారా యువతకు

## విదేశాల్లో ఉద్యోగాలు

గల్ఫ్ ఏజెంట్ల బారిన పడకుండా ప్రత్యేక జాగ్రత్తలు 03

- పుష్కరాల పనులు వేగవంతం చేయాలి
- రహదారుల నిర్మాణం కోసం కేంద్ర మంత్రులను కలుస్తాం
- ధర్మపురిలో పుష్కరాల పనులపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమీక్ష

ముద్ర, కరీంనగర్



## నేడు పది ఫలితాలు




- టెన్త్ ఫలితాలకు రంగం సిద్ధం
- విద్యార్థుల ఉత్కంఠకు తెరపడనుంది
- 5.15 లక్షల మంది భవిష్యత్తు నిర్ణయించే ఫలితాలు
- మూల్యాంకనం పూర్తి.. అధికారిక ప్రకటనకు సన్నాహాలు ముగింపు

03

## పైలట్‌కు బెయిల్

మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో హై కోర్టు మంజూరు

- ప్రతిరోజూ విచారణ అధికారి వద్దకు రావాలని పైలెట్ రోహిత్ రెడ్డికి ఆదేశం
- పాస్‌పోర్ట్ సమర్పించాలన్న కీలక నిబంధన
- సాక్షులపై ప్రభావం చూపొద్దని హెచ్చరిక
- నెలన్నర తర్వాత చంచల్‌గూడ జైలు నుంచి విడుదల

03



## ఏఐ డేటా హబ్‌గా విశాఖపట్నం

గత విధ్వంస పాలనలో పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు వెళ్లిపోయాయి

- గూగుల్ ని అడ్డుకునేందుకు వైసీపీ ఎంపీతో కేసులు వేయించారు
- గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో చంద్రబాబు, లోకేష్


10




# మళ్లీ ఫాంలోకి కేసీఆర్

విరామం తర్వాత కేసీఆర్ గళం..
తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ వేడి

- ఉద్యమ శైలిలో మళ్లీ కేసీఆర్..
- పాత జోష్‌తో రాజకీయ రంగంలోకి
- 2009 పొత్తుపై కొత్త వివరణ..
- కేసీఆర్ 'మాస్టర్ స్ట్రోక్' మళ్లీ చర్చలోకి
- తెలంగాణ ఆత్మగౌరవం మళ్లీ అజెండా..
- రైతు బంధు వెనుక అసలు కథ బయటపెట్టిన కేసీఆర్
- బీజేపీ, కాంగ్రెస్‌పై ఘాటు వ్యాఖ్యలు..
- కేసీఆర్ రీఎంట్రీతో తెలంగాణ పాలిటిక్స్‌లో మళ్లీ హై వోల్టేజ్ పోరు






**ముద్ర డెస్క్ :**
సుదీర్ఘ విరామం తర్వాత కేసీఆర్ మళ్లీ తన పాత 'ఉద్యమ' శైలి గళాన్ని వినిపించడం తెలంగాణ రాజకీయాల్లో ఒక్కసారిగా వేడిని పెంచింది. పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేళ ఆయన చేసిన విశ్లేషణలు.. అటు గతాన్ని గుర్తుచేస్తూనే, ఇటు భవిష్యత్ కార్యాచరణను దిశానిర్దేశం చేసవిగాపార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా చంద్రబాబుతో పొత్తు వెనుక ఉన్న 'తెలంగాణ' వ్యూహంపై ఆయన చేసిన వ్యాఖ్యలు రెండు రాష్ట్రాలను ఆలోచింప చేస్తున్నాయి. తెలంగాణ రాజకీయ ముఖచిత్రంపై బీఆర్ఎస్ బాస్ కేసీఆర్ మళ్లీ తనదైన ముద్ర వేశారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన ప్రసంగం కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాలేదు.. తెలంగాణ ఉనికిని, ఆత్మగౌరవాన్ని తట్టిలేపే ప్రయత్నంలా కనిపించింది. 2009లో తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకోవడం కేవలం సీట్ల సర్దుబాటు కోసం కాదని, సమైక్యవాదాన్ని గట్టిగా వినిపించే చంద్రబాబు చేత 'తెలంగాణకు అనుకూలం' అని చెప్పించడమే తన అసలు లక్ష్యమని కేసీఆర్ చెప్పడం ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యింది.

### 2009 నాటి 'మాస్టర్ స్ట్రోక్'

కేసీఆర్ తన రాజకీయ ప్రస్థానంలో ఎన్నో ఎత్తు పల్లాలు చూశారు. మరెన్నో పొత్తులు పెట్టుకున్నారు, ఇందులో 2009 నాటి పొత్తు అత్యంత చర్చనీయాంశమైంది. అప్పటి వరకు తెలంగాణకు వ్యతిరేకంగా ఉన్న టీడీపీని, తన వ్యూహంతో తెలంగాణ అనుకూల వైఖరి వైపు మళ్లించడంలో మిగతా 02లో

తెలంగాణలో ఇంధన

# కష్టాలకు చెక్

రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సరఫరా 126% పెంపు

- పెరిగిన డిమాండ్‌తో బంకుల వద్ద రద్దీ.. అత్యవసర ప్రభుత్వ చర్యలు
- పరిశ్రమల డీజిల్ ధర పెంపు.. పక్క రాష్ట్రాల ప్రభావం కీలకం
- రోజువారీ సరఫరా దాదాపు రెట్టింపు.. నిల్వలపై పర్యవేక్షణ
- పుకార్లను నమ్మొద్దని హెచ్చరిక..
- అవసరానికి మించి కొనొద్దని విజ్ఞప్తి






**ముద్ర డెస్క్:**
రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత లేకుండా చూడటానికి తెలంగాణ పౌర సరఫరాల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఆదివారం నుంచి ఇంధన సరఫరాను 126 శాతం మేర పెంచింది. ఇటీవల పెరిగిన డిమాండ్ కారణంగా పెట్రోల్ బంకుల్లో ఏర్పడిన రద్దీని తగ్గించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.
పెట్రోల్ బంకుల వద్ద అకస్మాత్తుగా పెరిగిన రద్దీకి మూడు ప్రధాన కారణాలు ఉన్నట్లు వెల్లడించారు. పరిశ్రమలకు వినియోగించే డీజిల్ ధరను లీటరుకు రూ.150కు పెంచడంతో, వ్యాపారులు తక్కువ ధరలో లభించే సాధారణ బంకులకు మళ్లుతున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో సరఫరా సమస్యలు తలెత్తడంతో, సరిహద్దు జిల్లాలైన ఖమ్మం, నిర్మల్ ప్రాంతాలకు ఇతర రాష్ట్రాల ప్రజలు వచ్చి ఇంధనం కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు ఎన్నికల తర్వాత ధరలు పెరుగుతాయనే పుకార్లతో ప్రజలు అవసరానికి మించి కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు.
ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర (ఐపీఎస్) చమురు కంపెనీలకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,100 ట్యాంకర్లను రంగంలోకి దించి సరఫరాను వేగవంతం చేశారు. పెట్రోల్ బంకుల్లో నిల్వలు తగ్గకముందే ఇంధనం చేరేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు. ప్రతి 3 గంటలకు ఒకసారి మిగతా 02లో

## ఆంధ్రజ్యోతి విలేకరి దారుణ హత్య

10


- కత్తులతో పాశవికంగా నరికి చంపిన రౌడీషీటర్
- మరో పాత్రికేయుడికి స్వల్ప గాయాలు
- ఐజేయు, టీయుడబ్ల్యూజే ఖండన



## కొత్త డీజీపీ సీవీ ఆనంద్

- తెలంగాణ పోలీస్ విభాగానికి కొత్త చీఫ్
- క్రికెట్ మైదానం నుంచి పోలీస్ బాస్ వరకు ప్రస్థానం ఇదే!
- యూపీఎస్సీ సిఫార్సులతో నియామకం
- విస్తృత అనుభవంతో రాష్ట్ర పోలీస్ బలగాలకు కొత్త నాయకత్వం
- ట్రాఫిక్ నుంచి సైబర్ వరకు సంస్కరణలతో గుర్తింపు పొందిన అధికారి
- నక్సలైట్ ప్రాంతాల అనుభవంతో చట్టవ్యవస్థ బలోపేతానికి అడుగులు

10



## ఇంధన ధరల పెంపు లేదు

ఎన్నికల తర్వాత ఉంటుందని సోషల్ మీడియాలో అసత్యప్రచారం
నమ్మవద్దన్న కేంద్ర పెట్రోలియం, ఇంధన శాఖ 09

- సరిపడా నిల్వలు ఉన్నాయని భరోసా
- పెంపు యోచనే లేదని వెల్లడి
- అపోహలకు లొంగవద్దని ప్రజలకు కేంద్రం సూచన
- అంతర్జాతీయ ఒత్తిళ్ల మధ్య వినియోగదారులపై భారం పడనివ్వమని హామీ




- ఉక్రెయిన్ లో మనుషులు మాయం..
- యుద్ధ భీకరంలో మానవత్వం కరిగిపోతుందా..?
- ఆకలి కాటుతో అమానుషానికి దిగుతున్న సైనికులు
- డోనెట్స్ ఘటనలు ప్రపంచాన్ని కలవరపెడుతున్నాయి
- రణరంగంలో ప్రాణాల కోసం పోరాటం ఎంత దారుణం..!
- శాంతి కోసం పిలుపులు పెరుగుతున్నా యుద్ధం మాత్రం ఆగడం లేదు

09

# రష్యా సైనికుల నరమాంస భక్షణ!

ఆకలితో తోటి సైనికులనే చంపి తింటున్నారు!

యుద్ధం అంటే కేవలం సరిహద్దుల్లో జరిగే కాల్పులు, కూలిపోయే భవనాలు మాత్రమే కాదు.. అది మానవ నాగరికతను కొన్ని వందల ఏళ్లు వెనక్కి నెట్టేసే ఒక మహా విషాదం. మనిషి తన మనుగడ కోసం ఎంతటి అమానుషానికైనా తెగిస్తాడని ఉక్రెయిన్ సరిహద్దుల్లో వెలుగు చూస్తున్న ఘటనలు నిరూపిస్తున్నాయి. తుపాకీ గుళ్లకు భయపడని సైనికుడు ఆకలి మంటకు తాళలేక తోటి మనిషి మాంసాన్ని తినే స్థితికి చేరుకున్నాడంటే పరిస్థితి ఎంత భయానకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో ఇప్పటివరకు రక్తపాతాన్ని చూసిన ప్రపంచం, ఇప్పుడు రష్యా సైనికుల 'నరమాంస భక్షణ' వార్తలతో నివ్వెరపోతోంది. ఆకలి తీర్చుకోవడానికి ఆయుధాలు పట్టిన చేతులే తోటి సైనికుల ప్రాణాలు తీసి భుజించడం యుద్ధం మిగిల్చిన దారుణమైన వైకల్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.

-ముద్ర డెస్క్



ఇదీ AI
ముద్ర



గౌతమ బుద్ధుడి సూచనలు



బుద్ధుడు బోధించినట్టు వర్తమానంలో జీవించండి. గతం-భవిష్యత్తు ఆలోచనలలో కాకుండా ఈ క్షణంపై దృష్టి పెట్టండి.

# మళ్లీ ఫాంలోకి కేసీఆర్



(మొదటి పేజీ తరువాయి)
కేసీఆర్ సఫలమయ్యారు. తద్వారా సమైక్యవాద శక్తుల బలాన్ని తగ్గించి, ఉద్యమాన్ని జాతీయ స్థాయికి తీసుకువెళ్లగలిగారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో సోనియా గాంధీ 16 సార్లు కోరినా, హైదరాబాద్ విషయంలో అంగుళం కూడా వెనక్కి తగ్గలేదని కేసీఆర్ చెప్పుకచ్చారు. నాడు తాను పడిన ఒత్తిడిని, చూపిన తెగువను మరోసారి ప్రజలకు గుర్తుచేశారు. 'మొండెం లేని శరీరం' అనే పదం ద్వారా హైదరాబాద్ ప్రాముఖ్యతను ఆయన మరోసారి నొక్కిచెప్పారు.

**రైతు బంధు' వెనుక అసలు కథ**

కేసీఆర్ పాలనలో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'రైతు బంధు' పథకం పుట్టుక వెనుక ఉన్న రహస్యాన్ని కూడా ఆయన పంచుకున్నారు. ప్రపంచ ప్రఖ్యాత నిపుణుడు అశోక్ గుల్హాటియా సూచన మేరకు రైతులకు నేరుగా పెట్టుబడి సాయం అందించేలా ఈ పథకాన్ని తీసుకువచ్చినట్లు స్పష్టం చేశారు. అలాంటి బృహత్తర పథకానికి ప్రస్తుత ప్రభుత్వం ఏ గతి పట్టించిందో చూసి కన్నీటి పర్యంతమయ్యానన్నారు. రైతు బంధు నిధుల పంపిణీలో జాప్యంపై ప్రభుత్వాన్ని నిలదీశారు.

**చిల్లర' ప్రభుత్వం**

ప్రస్తుత కాంగ్రెస్, బీజేపీలపై కేసీఆర్ కనీవినీ ఎరుగని రీతిలో ఫైర్ అయ్యారు. అంబేద్కర్ విగ్రహం వద్దకు సందర్శకులను వెళ్లనివ్వకపోవడాన్ని ఆయన 'చిల్లర రాజకీయం'గా పేర్కొన్నారు. అసెంబ్లీలో వాడే భాష సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. బీజేపీని ఒక 'మనువాద' పార్టీ అంటూ.. ఆ పార్టీలో మహిళలకు సరైన గౌరవం దక్కదని ఆరోపించారు. తేజస్వి సూర్య వంటి నేతలు తెలంగాణపై చేస్తున్న వ్యాఖ్యలను ప్రభుత్వం ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు.

**భవిష్యత్ కార్యాచరణ**


కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, పార్టీని పునర్నిర్మించే పనిలో కేసీఆర్ నిమగ్నమయ్యారు. సంస్థాగతంగా పార్టీని ప్రక్షాళన చేస్తూ పాత కమిటీలన్నింటినీ రద్దు చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి 200 మంది ప్రత్యేక శిక్షణ పొందిన 'తెలంగాణ వారియర్స్'ను రంగంలోకి దించుతామని ప్రకటించారు. విద్యార్థి విభాగాలను బలోపేతం చేయడం ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ పట్టు తిరిగి సాధించాలని భావిస్తున్నట్లు చెప్పారు. కేసీఆర్ తాజా ప్రసంగం చూస్తుంటే, ఆయన మళ్లీ పాత 'ఉద్యమ' గూటికి చేరుకున్నట్లు అనిపిస్తోంది. అధికారం కోల్పోయిన బాధ కంటే, తెలంగాణ ప్రజల ప్రయోజనాలు దెబ్బతింటున్నాయనే ఆవేదన ఆయన మాటల్లో కనిపిస్తోంది. 'తెలంగాణ వారియర్స్' సిద్ధం కావాలని ఆయన ఇచ్చిన పిలుపు, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో రాజకీయ పోరు మరింత తీవ్రం కాబోతోందని సూచిస్తోంది. కేసీఆర్ మార్క్ విశ్లేషణలు, వేసే రాజకీయ ఎత్తుగడలు మళ్లీ తెలంగాణ పాలిటిక్స్‌లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారాయి.

# తెలంగాణలో ఇంధన కష్టాలకు చెక్

(మొదటి పేజీ తరువాయి)
నిల్వల వివరాలు సేకరించడంతో పాటు, రోజువారీ సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ చర్యల ఫలితంగా రాష్ట్రంలో ఇంధన సరఫరా గణనీయంగా పెరిగింది. ఏప్రిల్ 27 నాటికి డీజిల్ పంపిణీ 151 శాతం పెరిగి 7,348 కిలోలీటర్ల నుంచి 18,449 కిలోలీటర్లకు చేరుకుంది. పెట్రోల్ సరఫరా కూడా 95 శాతం పెరిగి 5,883 కిలోలీటర్ల నుంచి 11,490 కిలోలీటర్లకు పెరిగింది. రాజధాని హైదరాబాద్‌లో ప్రత్యేక చర్యలు తీసుకుని ఇంధన సరఫరాను 43 శాతం పెంచారు. నగరంలో డీజిల్ నిల్వలు 46 శాతం, పెట్రోల్ నిల్వలు 40 శాతం మేర పెరిగినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా ఇంధన కొరత లేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రజలు పుకార్లను నమ్మకుండా అవసరమైన మేరకే ఇంధనం కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సరఫరా కొనసాగుతుందని హామీ ఇచ్చారు.




# రెండేళ్లలో వైజాగ్‌ను మార్చేసిన చంద్రబాబు






**ముద్ర డెస్క్ :**
సముద్రం.. ఆర్కే బీచ్.. నేవీ.. కొండలు.. మన్యం ప్రాంతం.. విశాఖపట్నం పేరు ప్రస్తావనకు వస్తే మన మదిలో ఈ ప్రాంతాలు మెదులుతూ ఉంటాయి. ఇవన్నీ కూడా ఐకానిక్ ప్రదేశాలుగా పేరుపొందాయి. ఇప్పుడు వీటి స్థానంలో మానవ నిర్మిత అభివృద్ధి కేంద్రాలు స్థానం సంపాదించుకోబోతున్నాయి. అవి కేవలం విశాఖపట్నం నగరాన్ని మాత్రమే కాదు.. యావత్ ఆంధ్రదేశ భవితను మొత్తం మార్చబోతున్నాయి.

విశాఖపట్నం ప్రాంతాన్ని పర్యాటకంగానే ఇప్పటిదాకా చూశారు. అయితే ఆ నగరంలో మరో కోణాన్ని చూశారు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు. అందువల్లే ఈ ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధికి ఆయన శ్రీకారం చుట్టారు. 2014 నుంచి 2019 వరకు విశాఖపట్నంలో విస్తృతంగా రోడ్లను నిర్మించారు. ఐటీ కార్యకలాపాలకు విశాఖపట్నం అనుకూలంగా ఉంటుందని కార్పొరేట్ కంపెనీలకు సంకేతాలు పంపించారు. దీంతో మనదేశంలో పేరుపొందిన కంపెనీలు శాఖలను ఏర్పాటు చేశాయి. 2019లో ఏపీలో ప్రభుత్వం మారిన తర్వాత ఐటీ కార్యకలాపాలు మందగించాయి.

మళ్లీ ఇప్పుడు ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖపట్నం రూపు రేఖలు మారిపోతున్నాయి. విశాఖపట్నం కేంద్రంగా ఐటీ కార్యకలాపాలు మొదలయ్యాయి. ఇప్పటికాలానికి అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆధారంగా పని చేసే డేటా సెంటర్లు కూడా విశాఖపట్నంలో ఏర్పాటు కాబోతున్నాయి. దీనికి తోడు క్లౌడ్ కంప్యూటింగ్ విభాగంలో కూడా విశాఖపట్నం అగ్రగామిగా వెలుగొందడానికి అడుగులు వేస్తోంది. విశాఖపట్నంలో మౌలిక వసతులు పెరిగిపోవడం.. భూములు ఇవ్వడానికి రైతులు ముందుకు రావడంతో పారిశ్రామిక అభివృద్ధి పరుగు పెడుతోంది..

చంద్రబాబు విశాఖపట్నం గ్లోబల్ క్యాపిటల్‌గా మార్చడానికి అడుగులు వేస్తున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో హైదరాబాద్ నగరంలో ఐటి అభివృద్ధికి చంద్రబాబు తీవ్రంగా కృషి చేశారు. ఇప్పుడు ఏపీలో ముఖ్యంగా విశాఖపట్నంలో ఐటీ ఆధారిత కార్యకలాపాలు సాగడానికి చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. విశాఖపట్నంకి గ్లోబల్ గుర్తింపు తీసుకురావడానికి ఆ మధ్య జరిగిన ప్రపంచం పెట్టుబడిదారుల సదస్సులను ఉపయోగించుకున్నారు. ఈ క్రమంలోనే విశాఖపట్నంలో గూగుల్ వంటి సంస్థలు తమ కార్యకలాపాలను వేగవంతం చేయడానికి అనుకూల పరిస్థితులు కల్పించారు. కేంద్రంలో ఎలాగూ సపోర్ట్ ఉంది కాబట్టి.. చంద్రబాబు గూగుల్ ప్రతినిధులతో మంతనాలు జరపడం ఈజీ అయిపోయింది.

ఐటీ మంత్రిగా నారా లోకేష్ తెరమందు ప్రయత్నాలు మొత్తం చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను సరళీకృతం చేశారు. ప్రపంచ పెట్టుబడిదారులకు గమ్యంగా విశాఖపట్నం ఎందుకు ఉంటుందో పదేపదే వివరించే ప్రయత్నం చేశారు. దీనికి తోడు భూముల కేటాయింపు నుంచి మొదలుపెడితే అనుమతుల వరకు ప్రతి విషయంలోనూ ఆయన చొరవ తీసుకున్నారు. అందువల్లే గూగుల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చింది. గూగుల్ సంస్థ రావడంతో.. రిలయన్స్.. అదాని.. మిట్టల్ వంటి సంస్థలు కూడా వచ్చేశాయి. ఇవన్నీ కూడా ఒక విశాఖపట్నం నగరంలోనే దాదాపు మూడు లక్షల కోట్లకు మించి పెట్టుబడులు పెడుతున్నాయి. దీనిని బట్టి విశాఖపట్నం నగరానికి భవిష్యత్తు కాలంలో ఏ స్థాయిలో డిమాండ్ ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.. ఒక బిజినెస్ ఏర్పాటు కావాలంటే దానికి అనుకూల పరిస్థితులు ఉండాలి. ఆ పరిస్థితులను చంద్రబాబు కల్పించారు కాబట్టి.. విశాఖపట్నం గ్లోబల్ కాపిటల్ గా మారబోతోంది.

# పాకిస్తాన్‌లో కొనసాగుతున్న ఉగ్రవేట

## మరో కీలక నేతను లేపేసిన అజ్ఞాత వ్యక్తులు!



**ముద్ర డెస్క్ :**
పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదంతో భారత్ దశాబ్దాలుగా ఇబ్బంది పడుతోంది. ఒకవైపు అంతర్గతంగా నక్సలిజం.. మరోవైపు పాకిస్తాన్ ఉగ్రవాదులు దేశానికి అతిపెద్ద సమస్యగా మారాయి. ఈ క్రమంలో ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం దేశంలో వేళ్లూనుకున్న నక్సలిజం, మావోయిస్టులను కూకటి వేళ్లతో పెకిలించే ప్రయత్నం చేసింది. మార్చి 31 నాటికి దాదాపు 90 శాతం మావోయిస్టులు లొంగిపోయారు. మిగిలినవారు కూడా అదేబాటలో ఉన్నారు. అగ్రనేత గణపతి లొంగిపోతే మావోయిస్టులు ముగిసినట్లే. ఈ క్రమంలో కేంద్రం పహల్గాం ఘటన తర్వాత ఉగ్రవాదుల ఏరివేత, ఉగ్ర లింక్కుల కత్తిరింపు.. పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులను టార్గెట్ చేసింది. దేశంలోని ఉగ్రవాదులను, ఓవర్ గ్రౌండ్ నెట్ వర్క్‌లను ఏరివేస్తోంది. ఇదే సమయంలో పాకిస్తాన్‌లో దురంధర్ సినిమా తరహాలో అజ్ఞాత సాయుధులు భారత వ్యతిరేక ఉగ్రవాదులను లేపేస్తున్నారు. ఇప్పటికే వంద మందికిపైగా ఉగ్రవాదులను సాయుధులు మట్టుబెట్టారు. దీంతో పాకిస్తాన్ గడ్డపై ఆశ్రయం పొందుతున్న ఉగ్రవాద మూకలకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. తాజాగా ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో లష్కరే–ఎ–తోయిబా చీఫ్ హఫీజ్ సయీద్‌కు అత్యంత సన్నిహితుడైన షేక్ యూసుఫ్ అఫ్రీదిని గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు. పాక్ వ్యాప్తంగా గత కొంతకాలంగా ఇలాంటి ఘటనలు పదేపదే జరుగుతుండటం ఉగ్రవాద సంస్థల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

**ఉగ్రవాదులను టార్గెట్ చేసిన అజ్ఞాత వ్యక్తులు..**

గత కొంతకాలంగా పాకిస్తాన్ కేంద్రంగా భారత్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఉగ్రనేతలు వరుసగా ప్రాణాలు కోల్పోతున్నారు. గతంలో ముఫ్తీ హబీబుల్లా హక్కానీ, షేక్ మోయిజ్ ముజాహిద్, అబూ ఖతల్ వంటి మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులు సైతం ఇలాగే గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హతమయ్యారు. ఈ తరహా ఘటనలు ఉగ్రవాదులకు పాకిస్తాన్ ఇప్పుడు సురక్షితమైన ఆశ్రయం కాదనే విషయం స్పష్టం చేస్తున్నాయి.

**అభద్రతలో ఉగ్రవాద సంస్థలు**

పాక్ ఆర్మీ రక్షణలో ఉన్నామని భావించే ఉగ్రనేతలకు కూడా ఈ పరిణామాలు నిద్రలేకుండా చేస్తున్నాయి. లాహోర్ వంటి నగరాల నడిబొడ్డున కూడా ఉగ్రవాద నేతలపై కాల్పులు జరగడం, పాకిస్తాన్ భద్రతా వ్యవస్థల వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది. ఒకప్పుడు భారత్‌లో మారణహోమానికి పాల్పడిన నేతలు ఇప్పుడు తమ ప్రాణాలను కాపాడుకునేందుకు అజ్ఞాతంలోకి వెళ్లాల్సి వస్తోంది. ఈ పరిణామాలు అంతర్జాతీయ ఉగ్రవాద ముఠాల్లో ఆందోళన పెంచడమే కాకుండా, వారి ఉనికి ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

# యుద్ధంలో ఇరుక్కున్న అగ్రరాజ్యం

**ముద్ర డెస్క్ :**
కేవలం సామ్రాజ్యవాద కాంక్షతో పశ్చిమాసియాలో యుద్ధ జ్వాల రగిలించిన అమెరికా ఇప్పుడు అందులో నుంచి బయటపడేందుకు తంటాలు పడుతోంది. యుద్ధం నుంచి ఎలా బయట పడలో తెలియక సతమతమవుతోంది. ఇరాన్‌తో పోరు అమెరికాకు ఊహించిన దానికంటే ఎక్కువ ప్రతికూల ప్రభావాలను తీసుకురాబోతోంది. అగ్రరాజ్యం దశాబ్ద కాలంగా నిల్వ చేసుకున్న క్షిపణి వ్యవస్థలు ఈ పోరాటంలో వేగంగా కరిగిపోతున్నాయి. పరిమిత సంఖ్యలోనే తయారు చేయగలిగే దీర్ఘ పరిధి క్షిపణులు ఖర్చు అయ్యే క్రమంలో భవిష్యత్తులో తలెదురయ్యే సవాళ్లకు అవి సరిపోకపోయే ప్రమాదం నెలకొంది.



**పశ్చిమాసియాకు మెజారిటీ సైన్యం..**

ఇరాన్‌తో ఉద్రిక్తతలు పెరగడంతో అమెరికా ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో మోహరించిన సైన్యాన్ని, పసిఫిక్, యూరోప్ వంటి ప్రాంతాల నుంచి పశ్చిమాసియాకు తరలిస్తోంది. ఈ ప్రాంతంలో జపాన్‌లోని మెరైన్ కోర్ యూనిట్‌లు, విమానవాహక నౌకలు వంటివి కేంద్రీకృతం అవుతున్నాయి. దీంతో ఇండో–పసిఫిక్ వంటి హైపోటెన్షియల్ టైట్ జోన్లలో అమెరికా సామర్థ్యం తగ్గింది. ప్రత్యర్థులకు అవకాశాలు పెరుగుతున్నాయి.

**చైనా వద్ద క్షిపణి బలం..**

అమెరికా ఇండో–పసిఫిక్ కమాండర్ అడ్మిరల్ శామ్యూల్ జె పాపారో చెప్పినట్టు, భవిష్యత్తులో చైనాతో యుద్ధం వస్తే క్షిపణుల అవసరం భారీగా ఉంటుంది. కానీ ఇప్పటికే చైనా వద్ద పెద్ద సంఖ్యలో క్షిపణులు ఉన్నాయి. తైవాన్‌పై చైనా పట్టు ఇంకా బలపడుతుండటంతో, ఆ ప్రాంతంలో అమెరికా–మిత్రదేశాల స్థావరాలు లక్ష్యం కావచ్చనే ఆందోళన పెరుగుతోంది. ఇరాన్‌తో పోరులో అమెరికా ఇప్పుడు ఉపయోగిస్తున్న పెద్ద సంఖ్యలో క్షిపణులు, పశ్చిమాసియాలో మోహరించిన సైన్యం తైవాన్ వివాదం వస్తే చైనాతో పోరాడడానికి తగినంతగా ఉండవనే అవకాశం ఉంది.

ఇరాన్‌తో యుద్ధం కారణంగా అమెరికా సైనిక వ్యయం రోజుకు సుమారు ఒక బిలియన్ డాలర్ల వరకూ పెరిగింది. ఈ పెద్ద భారం స్వదేశంలో ప్రజా–రాజకీయ వ్యతిరేకతగా మారుతోంది. పశ్చిమాసియాలో అమెరికా పరిస్థితి నుంచి వెనక్కి తగ్గే అవకాశం కనిపించటం లేదు. అందువల్ల తానే ప్రతికూల సమస్యను సృష్టించి.. తానే ఆ వలలో బంధించబడినట్లుగా అమెరికా పరిస్థితి మారిపోతోంది. యుద్ధం ఇప్పటికీ నియంత్రణలోనే ఉన్నా.. దాని ద్వారా సృష్టించే ఆర్థిక, సైనిక, రాజకీయ ఖాళీలు కాలక్రమేణా పెద్ద ప్రభావం చూపనున్నాయి.

# యూఏఈ సంచలన నిర్ణయం..



**ముద్ర, న్యూఢిల్లీ :**
పశ్చిమాసియాలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. గల్ఫ్ దేశమైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సంచలన నిర్ణయాన్ని ప్రకటించింది. చమురు ఉత్పత్తి చేసే దేశాల కూటమి అయిన ఒపెక్ (OPEC), ఒపెక్+ (OPEC+) నుంచి బయటకొస్తున్నట్లు తెలిపింది. మే 1 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానుంది. చమురు ఎగుమతి దేశాల కూటమికి, దానికి నాయకత్వం వహిస్తున్న సౌదీ అరేబియాకు ఇది అతిపెద్ద దెబ్బగా విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఆర్గనైజేషన్ ఆఫ్ ది పెట్రోలియం ఎక్స్‌పోర్టింగ్ కంట్రీస్ (OPEC)లో చాలా ఏళ్లుగా యూఏఈ సభ్యదేశంగా ఉంది. ఒపెక్ ఏర్పాటైన ఏడేళ్ల తర్వాత 1967లో ఒపెక్‌లో చేరిన యూఏఈ.. సౌదీ అరేబియా, ఇరాక్ తర్వాత మూడో అతిపెద్ద చమురు ఎగుమతిదారుగా ఉంది. ఒపెక్ నిర్ణయాల్లో కీలకంగా వ్యవహరిస్తూ వస్తోంది. సుదీర్ఘకాలంపాటు సభ్యదేశంగా కొనసాగిన యూఏఈ.. అనూహ్యంగా ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక కారణమేంటన్నది వెల్లడించలేదు. దేశ ప్రయోజనాల రీత్యా నిర్ణయం తీసుకున్నారు.

అయితే, భౌగోళిక ఉద్రిక్తతలు, ఉత్పత్తి పెంపు విషయంలో ఒపెక్‌లో తలెత్తిన అంతర్గత కలహాల నేపథ్యంలో యూఏఈ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ దాడుల విషయంలో సౌదీ అరేబియా వంటి తన ప్రాంతీయ మిత్రదేశాలు సరైన రీతిలో స్పందించకపోవడం పట్ల యూఏఈ అసంతృప్తితో ఉంది. ఈ నేపథ్యంలో ఒపెక్ నుంచి యూఏఈ బయటకు వచ్చింది. దీనివల్ల భవిష్యత్‌లో ఒపెక్ బలహీనం అవుతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇప్పటికే హర్మూజ్ మూసివేతతో చమురు ఎగుమతిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఒపెక్ దేశాలకు.. యూఏఈ ఈ రూపంలో మరో షాక్ తగిలింది.

# మే 9న పాస్‌పోర్ట్ మెగా మేళా

## హైదరాబాద్ ఆర్పీవో స్నేహజ



**ముద్ర, డెస్క్:** వేసవి సెలవుల్లో విహార యాత్రలు, పైచదువులకు విదేశాలకు వెళ్లేందుకు విద్యార్థులు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో పాస్‌పోర్ట్ అపాయింట్‌మెంట్లకు భారీగా డిమాండ్ ఏర్పడింది. దీనిని పరిగణనలోకి తీసుకొని మే 9న ప్రత్యేక పాస్‌పోర్ట్ మేళా నిర్వహిస్తున్నట్టు సికింద్రాబాద్‌లోని ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం వెల్లడించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 5 పాస్‌పోర్ట్ కేంద్రాల్లో 4 వేల అపాయింట్‌మెంట్లు (స్లాట్లు) విడుదల చేసినట్లు ఆర్పీవో జె.స్నేహజ తెలిపారు. ఇందులో ఎక్కువగా హైదరాబాద్ పరిధిలోని రాయదుర్గం, ఎంజీబీఎస్, బేగంపేట పాస్‌పోర్ట్ సేవాకేంద్రాల్లో 3,100.. నిజామాబాద్, కరీంనగర్ పీఎస్‌కేల్లో 900 అపాయింట్‌మెంట్లు ఉన్నాయని చెప్పారు. ఇప్పటికే స్లాట్ బుక్ చేసుకున్నవారు ఈ మేళాలో భాగస్వామ్యం అయ్యేందుకు అపాయింట్‌మెంట్లను రీషెడ్యూల్ చేసుకోవచ్చన్నారు. పాస్‌పోర్ట్ జారీ ప్రక్రియకు సంబంధించి ఎదురయ్యే సందేహాల నివృత్తి, సమస్యల పరిష్కారానికి దరఖాస్తుదారులు rpo.hyderabad@cpo.gov.inలో సంప్రదించాలని సూచించారు. గతంలో ఉన్న ఈ–మెయిల్ ఐడీ సేవలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాల కోసం 040–27715115, 27715333 నంబర్లకు సంప్రదించవచ్చని చెప్పారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
29.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



గౌతమ బుద్ధుడి సూచనలు

కోపాన్ని నియంత్రించండి. అది ముందుగా మనల్నే దహించే అగ్ని అని గుర్తుంచుకోండి.



# - - నేడే టెన్త్ ఫలితాలు - -

**ముద్ర డెస్క్ :**




కొన్ని రోజుల కిందట ఇంటర్ ఫలితాలు వచ్చేశాయ్. ఇక టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఫలితాలు ఎప్పుడెప్పుడు వస్తాయా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు తెలంగాణ పదో తరగతి పరీక్షా ఫలితాలు విడుదలకు ప్రభుత్వ పరీక్షల విభాగం సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 29న ఫలితాలను వెల్లడించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మార్చి 14వ తేదీ నుండి ఏప్రిల్ 13 వరకు జరిగిన 10వ తరగతి పరీక్షలకు సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరుకాగా, ఏప్రిల్ 23 నాటికే జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేశారు. అధికారిక వెబ్‌సైట్ https://bse.telangana.gov.in/ ముందుగా ఫలితాలను మే మొదటి వారంలో విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ, ప్రక్రియ వేగవంతం కావడంతో ఏప్రిల్ నెలాఖరులోనే విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇంటర్ ఫలితాల తరహాలోనే రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు ముఖ్య అతిథిగా హాజరై టెన్త్ ఫలితాలను అధికారికంగా విడుదల చేయనున్నారు. నేడు ఫలితాలను విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

# నూతన కమిషనర్ ను కలిసిన టీయుడబ్ల్యూజే నేతలు




**ముద్ర, హైదరాబాద్ :**

రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన జి.ముకుందరెడ్డిని మంగళవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో రాష్ట్ర బాధ్యులు సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని విరాహత్ కోరారు. కమిషనర్ ను కలిసిన వారిలో టీయుడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డిలు ఉన్నారు

# మీడియా అకాడమీ చైర్మన్‌ను కలిసిన సమాచార శాఖ కమిషనర్

**ముద్ర, హైదరాబాద్ :**



రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జి.ముకుంద రెడ్డి, ఇవాళ తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డిని అకాడమీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మీడియా రంగ అభివృద్ధి, జర్నలిస్టుల శిక్షణ, సమాచార ప్రసారంలో ఆధునిక సాంకేతికత వినియోగంపై పరస్పరం చర్చించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రజలకు సమర్థంగా చేరవేయడంలో మీడియా అకాడమీ పాత్ర కీలకమని ముకుంద రెడ్డి పేర్కొన్నారు. అకాడమీ కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కె. శ్రీనివాస్ రెడ్డి కూడా కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్‌లో సమన్వయంతో పనిచేసేందుకు సిద్ధమని తెలిపారు.

# సింథటిక్ ట్రాక్ పనులు వేగవంతం చేయాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ముద్ర, ఖమ్మం:**

ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నూతనంగా నిర్మాణం జరుగుతున్న 400 మీటర్ల అథ్లెటిక్ సింథటిక్ ట్రాక్ పనులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ.. త్వరితగతిన పెండింగ్ పనులను మంచి నాణ్యతతో పూర్తి చేయాలని, జాతీయ స్థాయి పోటీలకు ట్రాక్ ను సిద్ధం చేసి ఖమ్మం అథ్లెట్ల చిరకాల స్వప్నం నెరవేర్చాలని సూచించారు. ఆయన వెంట నగర మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా యువజన, క్రీడల అధికారి తుంబూరు సునీల్ రెడ్డి, ఖమ్మం మున్సిపల్ అధికారులు ఉన్నారు.



# నైపుణ్య శిక్షణతో ఉద్యోగాలు

- గల్ఫ్ ఏజెంట్ల బారిన పడకుండా జాగ్రత్తలు
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ముద్ర, ధర్మపురి:**

రాష్ట్రంలో యువతకు సాంకేతిక నైపుణ్య శిక్షణ ఇచ్చి విదేశాల్లో ఉద్యోగాలు సాధించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని.. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ తో కలిసి ధర్మపురిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. 2027 లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ముందు చూపుతో భక్తులకు ఏలాంటి ఇబ్బందులు రాకుండా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని మంత్రి అన్నారు. ఇందులో భాగంగా బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న అన్ని ఆలయాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు మంత్రి వివరించారు. పుష్కరాల ఏర్పాట్ల కోసం మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తుందని మంత్రి అడ్లూరి తెలిపారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లో శిక్షణ పొందిన యువతకు స్థానికంగా ఉపాధి లభించడంతో పాటు విదేశాల్లో సైతం ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం టాంకాం దార యువతీ యువకులకు విదేశీ భాష పై అవగాహన కల్పించి గల్ఫ్ ఏజెంట్ల చేతిలో మోసపోకుండా ప్రభుత్వమే ఉద్యోగ భద్రత కల్పించి విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని మంత్రి వివరించారు.

**ఏటీసీల్లో అగ్రికల్చర్ కోర్సులు: వివేక్ వెంకటస్వామి**

ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో అగ్రికల్చర్ కోర్సును నూతనంగా ప్రవేశపెడుతున్నట్లు రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ వివేక్ తెలిపారు. తెలంగాణలో ముఖ్యంగా వ్యవసాయ ఆధారిత కుటుంబాలు ఎక్కువగా ఉన్నందున ఏటీసీల్లో అగ్రికల్చర్ కోర్స్ ప్రవేశపెడుతున్నట్లు మంత్రి తెలిపారు. 1400 ఏళ్ల చరిత్ర కలిగిన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టడం సంతోషకరమని మంత్రి తెలిపారు. టామ్ కామ్ ద్వారా జగిత్యాల జిల్లా నుండి 30 మందికి శిక్షణ ఇవ్వడానికి అభ్యర్థులను ఎంపిక చేయాలని మంత్రి వివేక్ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు.



# పుష్కరాల పనులు వేగవంతం చేయాలి

గోదావరి పుష్కరాల పనులతో పాటు ధర్మపురి క్షేత్రం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలు, ఆలయ అభివృద్ధిపై అధికారులతో మంగళవారం మంత్రి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో పాటు వివిధ శాఖల అధికారులతో ధర్మపురిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 2027లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని అన్నారు. అధికారులు ఇప్పటికే తయారుచేసిన ప్రణాళికలు మరో మారు పున సమీక్షించి ఎక్కడ ఇలాంటి ఇబ్బందులు రాకుండ చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. పుష్కరాలు కావాల్సిన నిధుల కోసం త్వరలోనే సీఎంను కలుస్తానని మంత్రి తెలిపారు. ధర్మపురి మండలం రాయపట్నం నుండి ధర్మపురి వరకు ఉన్న నేషనల్ హైవే 63 అభివృద్ధి పనుల నిధుల కోసం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కలిసి నిధులు సమకూర్చాలని కోరుతామని మంత్రి అన్నారు. ధర్మపురి క్షేత్రం అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. భూసేకరణకు ఉన్న ఇబ్బందులను స్థానికులతో చర్చించి భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యే విధంగా స్థానిక నేతలు చోరవ తీసుకోవాలని మంత్రి సూచించారు.

# పర వాసుదేవ అలంకార సేవలో యాదగిరీషుడు





**ముద్ర, యాదగిరిగుట్ట :**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆలయంతో పాటు అనుబంధాలయమైన పాత గుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారికి నిత్య పూజల అనంతరం స్వామివారిని యాగశాల ప్రవేశం చేసి ద్వారా తోరణ పూజ మూర్తి కుంభారాధన చతు స్థానార్చన నృసింహ లక్ష్మీ సుదర్శన శతకం గరుడ మూల మంత్రం హోమములు నిత్య పూర్ణాహుతి పాతగుట్టలో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం స్వామివారు గరుడ వాహనంపై పర వాసుదేవ అలంకార సేవను నిర్వహించి ఆలయ తిరు మాడవీధుల్లో ఊరేగుతో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం యాగశాలలో సాయ మారాధన నిత్య హవనము లక్ష్మీ నృసింహ సుదర్శన మూల హోమములు నిత్య పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భవాని శంకర్, ఆలయ చైర్మన్ నరసింహమూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు స్థానాచార్యులు కాండూరి వెంకటాచార్యులు, ఉప ప్రధానార్చకులు మంగళగిరి నరసింహమూర్తి, అర్చకులు శ్రీనాథ్ చార్యులు, అనిల్ కుమార్ చార్యులు, సూపర్డెంట్ సీతారాం సిబ్బంది రవీందర్ భక్తులు పాల్గొన్నారు.

# రోహిత్ రెడ్డికి ఊరట

- షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు
- ప్రతిరోజూ విచారణకు హాజరు కావాలని ఆదేశం
- పాస్‌పోర్ట్ సమర్పించాలని నిబంధన
- సాక్షులపై ప్రభావం చూపొద్దని హెచ్చరిక
- మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో జైలు నుంచి విడుదల



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ హైకోర్టులో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ నిబంధనలలో భాగంగా ప్రతిరోజూ దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని, తన పాస్‌పోర్టును పోలీసులకు అప్పగించాలని కీలక ఆదేశాలు జారీ చేసింది. అలాగే డ్రగ్స్ కేసు దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరించాలని, సాక్షులను ప్రభావితం చేసే ప్రయత్నాలు చేయవద్దని మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డిని ఆదేశించింది. మార్చి 14న మొయినాబాద్ ఫాంహౌస్‌లో డ్రగ్స్ తీసుకోవడంతో పాటు, తనిఖీలకు వచ్చిన ఎస్‌వోటీ పోలీసులపై కాల్పులు జరిపేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపై రోహిత్ రెడ్డితో సహా మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే. గతంలో ఉప్పర్‌పల్లి కోర్టులో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురవ్వడంతో రోహిత్ రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఏప్రిల్ 8న ఈ పిటిషన్‌పై వాదనలు పూర్తికాగా, మంగళవారం (ఏప్రిల్ 28న) నాడు రోహిత్ రెడ్డికి బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఊరటనిచ్చింది. హైకోర్టు తీర్పుతో రోహిత్ రెడ్డి నెలన్నర రోజుల తరువాత చంచల్ గూడ జైలు నుంచి విడుదల కానున్నారు.

# నందిని సిధారెడ్డికి ఘన సన్మానం



**ముద్ర, హైదరాబాద్:**

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ నందిని సిధారెడ్డికి తెలుగు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాసిన 'అనిమేష' కావ్యంపై ప్రత్యేక చర్చా కార్యక్రమం జరిగిందని ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు పరిశోధక విద్యార్థి పల్లె సతీష్ తెలిపారు.

**సామాజిక స్పృహకు నిదర్శనం 'అనిమేష'**

కరోనా విపత్కాలంలో వైద్యుల సేవలను, సమాజంలోని విలువల పతనాన్ని చిత్రించిన 'అనిమేష' కావ్యం ఒక అద్భుత సృజన అని సభలోని వక్తలు కొనియాడారు. ఈ కావ్యాన్ని 22 భారతీయ భాషల్లోకి అనువదించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు డాక్టర్ ఎస్. రఘు ప్రకటించారు. ఆచార్య సి.కాశీం, ఆచార్య సాగి కమలాకర శర్మ తదితరులు సిధారెడ్డి సాహిత్య ప్రస్థానాన్ని, తెలంగాణ ఉద్యమంతో ఆయనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

**భావోద్వేగపూరితంగా సిధారెడ్డి ప్రసంగం**

సన్మానం అనంతరం నందిని సిధారెడ్డి తన విద్యార్థి రోజుల జ్ఞాపకాలను పంచుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఆచార్య సి. నారాయణ రెడ్డి (సినారె)పై ఉన్న గౌరవంతో గణితాన్ని వదిలి సాహిత్యం వైపు అడుగులు వేశానని ఆయన తెలిపారు. విద్యార్థి దశలో అహంకారానికి తావులేకుండా అక్షరాన్ని, కవిత్వాన్ని ప్రేమించడం వల్లనే ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పారు. హాస్టల్ రోజుల్లో తనను ఆదుకున్న మిత్రుల స్నేహం కోట్లు విలువ చేసే ఆస్తితో సమానమని పేర్కొన్నారు. తన తండ్రి పడిన కష్టం, పల్లెలోని శ్రామికుల జీవితాలే తన సాహిత్యానికి ముడిసరుకని వినమ్రంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు కవితా పఠన పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలను అందజేశారు. డా.నాళేశ్వరం శంకర్, డా. బాణాల శ్రీనివాసరావు వంటి ప్రముఖులు, అధిక సంఖ్యలో విద్యార్థులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
బుధవారం 29.04.2026

4 వేదిక Peoples Voice
మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com



# నాట్య కళకు 9,000 ఏండ్ల చరిత్ర

(29 ఏప్రిల్ "అంతర్జాతీయ నాట్య దినోత్సవం" సందర్భంగా)

నాట్యం ఓ విశ్వ భాష. ప్రపంచ ప్రజలను ఏకం చేయగల శక్తివంతమైన సాంస్కృతిక సాధనం. నాట్యాన్ని మెచ్చని నరులుండరు. నాట్యం చేయడానికి వేదికను ఎక్కడం లేదా నాట్యాన్ని వీక్షించడానికి కళాభిమానిగా ప్రక్షకుల్లో ఉంటూ కళను ఆస్వదించడం తరుచుగా చేస్తున్నాం. ఒక మహాద్భుత అనుభూతిని, ప్రేరణను, అమితానందాన్ని అందిస్తున్నది నాట్య కళ. వివిధ ప్రాంతాల, దేశాల ప్రజలు వేరు వేరు నాట్య రూపాలను ప్రోత్సహిస్తున్నారు లేదా ప్రచారం చేస్తూ ప్రదర్శనలు ఇస్తున్నారు. నాట్య కళ ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఏట 29 ఏప్రిల్ రోజున విశ్వవ్యాప్తంగా "అంతర్జాతీయ నాట్య దినోత్సవం" లేదా "ఇంటర్నేషనల్ డాన్స్ డే"ను యునెస్కోతో కలిసి ఇంటర్నేషనల్ థియేటర్ ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా 1982 నుంచి నిర్వహించడమ ఆనవాయితీగా మారింది. ప్రపంచ ప్రఖ్యాత నాట్య కళాకారులు జీన్స్ జార్జెస్ నవ్వేరీ జన్మదినం సందర్భంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు.

**నాట్యకళకు 9,000 ఏండ్ల చరిత్ర:**

స్వయం ప్రకటనకు నిలువెత్తు నిదర్శనం నాట్యం మాత్రమే. దాదాపు 9,000 ఏండ్ల క్రితమే ప్రారంభమైన నృత్య కళ నేడు అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రజల వన్నులు పొందుతున్నది. సాంస్కృతిక సరిహద్దులు చెరుపుతూ విశ్వవ్యాప్తం కావడం, వైవిధ్యభరితమైన మానవాళిని ఒకే వేదికపైకి తీసుకురావడం, కళాభిమానులకు మానసిక ప్రశాంతతను చేకూర్చడం లాంటి పలు ప్రయోజనాలు కలిగిన నాట్యకళ ఆనందాలు పంచుతూ దేహం, మనసు, హృదయం, ఆత్మలకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. నాట్యం ద్వారా వ్యక్తిగత అభినయం, శరీర భాగాల సమన్వయం, భావోద్వేగాలను ఆకర్షణీయంగా వ్యక్తీకరించడం, మానసిక ఒత్తిడిని తగ్గించడం జరుగుతుంది.

**భారతంలో వైవిధ్యభరిత నాట్యకళ:**

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తున్న సువిశాల భారతంలో ఎన్నో శాస్త్రీయ, జానపద నాట్యాలు ప్రజాదరణను పొందాయి. భారత సంగీత అకాడమీ గుర్తించిన ఎనిమిది శాస్త్రీయ నృత్య కళల్లో భరతనాట్యం, కూచిపూడి, కథకుల, కథక్, ఒడిసి, మోహినీయాట్టం, మణిపురి, సత్రియాలు వస్తాయి. భారత దేశవ్యాప్తంగా 29 జానపద నాట్య కళారూపాలను గుర్తించినప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లో బహుళ ప్రచారం పొందిన జానపద నాట్యాల్లో విలాసిని, భామాకలాపం, వీర నాట్యం, డప్పు, తప్పెటగుళ్లు, లంబాడి, ధింసా, కోలాటం, పేరిణి, బుర్ర కథ, గుస్సాడి, చిందుల బాగోతం, బుట్ట బొమ్మలు, బోనాలు లాంటివి ఉన్నాయి.

డిజిటల్ యుగంలో నాట్య కళను సజీవంగా కొనసాగించడానికి ప్రభుత్వాలు, రాజకీయ వ్యవస్థలు, స్వచ్ఛంద సంస్థలు చొరవను చూపాలి. నాట్యకళను యువతలో ప్రోత్సహించాలి. నాట్య కళాకారులను తగు రీతిలో గుర్తించడం, చిన్నారులకు నాట్య శిక్షణ ఇప్పించడం, నాట్య కళాశాలలను ఏర్పాటు చేయడం, నాట్య శిక్షణ ఇచ్చే గురువులను ప్రోత్సహించడం, నాట్య కళ పట్ల సమాజంలో చిన్న చూపును రూపుమాపడం లాంటి చర్యలు సత్వరమే తీసుకొని మన నాట్యకళా వారసత్వ సంపదను రాబోయే తరానికి అందించే ప్రయత్నాలు జరగాలి.



- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఆరోగ్య సంజీవని "రాగి జావ"

## రోజూ తాగితే కలిగే అద్భుత ప్రయోజనాలు ఇవే!

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మన ఆహారపు అలవాట్లు పూర్తిగా మారిపోయాయి. పాతకాలపు చిరుధాన్యాల ప్రాముఖ్యతను గుర్తించిన ఆధునిక వైద్యులు, మళ్ళీ మనల్ని సంప్రదాయ ఆహారం వైపు మళ్లాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా రాగి జావను రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల శరీరానికి అవసరమైన అన్ని పోషకాలు అందుతాయి.

**రాగి జావ తాగడం వల్ల కలిగే ప్రధాన ప్రయోజనాలను ఒకసారి పరిశీలిద్దాం:**

**1. దృఢమైన ఎముకలు - పుష్కలమైన క్యాల్షియం**

రాగులలో క్యాల్షియం ఇతర తృణధాన్యాల కంటే చాలా ఎక్కువగా ఉంటుంది. దీనిని ప్రతిరోజూ తీసుకోవడం వల్ల ఎముకలు దృఢంగా మారతాయి. ముఖ్యంగా పెరుగుతున్న పిల్లలకు, మహిళలకు మరియు వృద్ధులకు ఎముకల బలహీనత రాకుండా ఇది రక్షణ కవచంలా పనిచేస్తుంది.



**2. రక్తహీనతకు చెక్!**

ప్రస్తుత రోజుల్లో చాలామంది మహిళలు రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారు. రాగులలో ఇనుము మోతాదు అధికంగా ఉండటం వల్ల, ఇది శరీరంలో హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచుతుంది. రక్తహీనత ఉన్నవారు క్రమం తప్పకుండా రాగి జావ తీసుకోవడం ఎంతో మేలు.

**3. రోగనిరోధక శక్తి పెంపు**

రాగి పిండిలో విటమిన్ సి , యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి శరీరంలో రోగనిరోధక శక్తిని పెంపొందించి, తరచూ వచ్చే జలుబు, దగ్గు మరియు ఇతర ఇన్ఫెక్షన్ల నుండి మనల్ని కాపాడతాయి.

**4. శరీరానికి చలవ.. వీర్యకణాల వృద్ధి**

ఎండకాలంలోనే కాకుండా, ఎప్పుడైనా శరీర వేడిని తగ్గించడానికి రాగి జావ అద్భుతంగా పనిచేస్తుంది. ఇది శరీరాన్ని చల్లబరచడమే కాకుండా, పురుషులలో వీర్యకణాల వృద్ధికి తోడ్పడుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతుంటారు.

**5. ప్రొటీన్ల నిలయం - పోషకాహార లోపం ఉండదు**

రాగులలో మాంసకృత్తులు (Proteins) మెండుగా ఉంటాయి. శాఖాహారులకు ఇది ఒక గొప్ప ప్రోటీన్ ఆహారం. దీనివల్ల కండరాలు దృఢంగా తయారవుతాయి మరియు శరీరానికి కావాల్సిన పోషకాలన్నీ అంది, పోషకాహార లోపం తలెత్తకుండా చూస్తుంది.

**6. గుండె ఆరోగ్యం.. కొలెస్ట్రాల్ నియంత్రణ**

రక్తంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో రాగి జావ కీలక పాత్ర పోషిస్తుంది. ఇది రక్తనాళాల్లో కొవ్వు చేరకుండా నియంత్రించి, రక్తపోటును అదుపులో ఉంచుతుంది. ఫలితంగా గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది.

**7. రోజంతా ఉత్సాహం.. శక్తి!**

రాగి జావ నెమ్మదిగా జీర్ణమవుతుంది దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగవు. అందుకే డయాబెటిస్ ఉన్నవారికి కూడా ఇది మంచి ఆహారం. అంతే కాకుండా, ఇది శరీరానికి నిలకడైన శక్తిని అందిస్తుంది, దీనివల్ల మీరు రోజంతా ఉత్సాహంగా, చురుగ్గా ఉండవచ్చు.

ఆరోగ్యమే మహాభాగ్యం. మన పూర్వీకులు అందించిన ఈ చిరుధాన్యాల గొప్పతనాన్ని గుర్తించి, ప్రతిరోజు ఒక గ్లాసు రాగి జావ తాగి మీ ఆరోగ్యాన్ని మీరే కాపాడుకోండి. ఇది కేవలం పానీయం మాత్రమే కాదు.. సంపూర్ణ ఆరోగ్యానికి ఒక మార్గం!

# ఖాళీ కడుపుతో వాకింగ్ చేస్తున్నారా..?

వేసవి వేడి దేశవ్యాప్తంగా సెగలు పుట్టిస్తోంది. ఈ ఎండల ధాటికి సామాన్యులే కాదు, ఫిట్‌నెస్ ప్రియులు కూడా బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా ఉదయాన్నే లేచి నడకకు వెళ్లే అలవాటున్న వారు ఈ సీజన్‌లో కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. చాలా మంది బరువు తగ్గాలనే ఉద్దేశంతో ఉదయాన్నే ఖాళీ కడుపుతో వాకింగ్ చేస్తుంటారు. కానీ మండే ఎండల్లో ఇలా చేయడం సురక్షితమేనా..? నిపుణులు ఏమంటున్నారు? ఇప్పుడు తెలుసుకుందాం.

ఉదయాన్నే ఏమీ తినకుండా నడవడం అనేది వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. ఎటువంటి అనారోగ్య సమస్యలు లేనివారు, శరీరంలో తగినంత నీటి శాతం ఉన్నవారు ఖాళీ కడుపుతో నలడవవచ్చు. అయితే నడక పూర్తి చేసిన తర్వాత మీకు అతిగా అలసట, నీరసం లేదా కళ్ళు తిరిగినట్లు అనిపిస్తే.. అది మీ శరీరానికి సరిపడటం లేదని అర్థం. అటువంటప్పుడు వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం మంచిది. మధుమేహం ఉన్నవారు ఖాళీ కడుపుతో నడకకు వెళ్లడం అత్యంత ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏమీ తినకుండా వ్యాయామం చేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పడిపోవచ్చు.

నడకకు వెళ్లే ముందు గుప్పెడు నానబెట్టిన శనగలు లేదా ఏదైనా ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల షుగర్ లెవల్స్ సమతుల్యంగా ఉంటాయి. మిగిలిన సీజన్లతో పోలిస్తే వేసవిలో చెమట ఎక్కువగా పడుతుంది. శరీరంలో నీటి శాతం తగ్గిపోవడం వల్ల ఖాళీ కడుపుతో నడిచే వారికి తలనొప్పి, కండరాల నొప్పులు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి నడకకు వెళ్లే కనీసం అరగంట ముందు తగినంత నీరు తాగడం మర్చిపోవద్దు.

వేసవిలో ఎండ తీవ్రత ఉదయం 7 గంటల నుండే మొదలవుతోంది. అందుకే ఉదయం 5 నుండి 6 గంటల మధ్యనే వాకింగ్ పూర్తి చేయడం ఉత్తమం. ఎండ పెరిగిన తర్వాత నడిస్తే శరీర ఉష్ణోగ్రత పెరిగి వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది.

# ట్రాఫిక్ కాలుష్యం-నగరాలకు మౌన విపత్తు!?

మన దేశం వేగంగా నగరీకరణ దిశగా దూసుకుపోతున్న ఈ కాలంలో, నగరాలు అభివృద్ధి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. అయితే ఈ అభివృద్ధి వెనుక దాగి ఉన్న సమస్యలు రోజురోజుకూ భయంకర రూపం దాల్చుతున్నాయి. జనాభా పెరుగుదల, వలసల ఒత్తిడి, వాహనాల విస్ఫోటనం,చినుకు పడితే జలదిగ్బంధం,వరద(డ్రైనేజీ) నీరు నిర్వహణ లోపం.ఎండాకాలం అగ్నిగుండం. జనాభాకు తగినన్ని పార్కులు,చెట్లు పెంచక పోవడం వలన పర్యావరణ కాలుష్యంతో –ఇవి అన్నీ కలసి నగర జీవనాన్ని క్లిష్టంగా మార్చుతున్నాయి. అభివృద్ధి అనే పేరు మీద అసమతుల్యత పెరిగితే, నగరాలు సౌకర్యాల కేంద్రాలుగా కాకుండా సమస్యల కేంద్రమాలుగా మారే ప్రమాదం ఉంది.

**నగరీకరణ వేగం-మౌలిక సదుపాయాల లోపం..**

మన దేశంలో నగరీకరణ వేగంగా పెరుగుతున్న ఈ కాలంలో మహానగరాలు, పెద్ద పట్టణాలు విస్తరణలో పరుగులు తీస్తున్నాయి. ఉపాధి అవకాశాలు, విద్య, వైద్య సదుపాయాలు, ఆధునిక జీవన విధానం——ఇవి అన్నీ ప్రజలను గ్రామాల నుండి నగరాల వైపు ఆకర్షిస్తున్నాయి. ఫలితంగా జనాభా విస్ఫోటనంలా పెరుగుతూ నగరాలపై అసమాన ఒత్తిడి పెరుగుతోంది. అయితే ఈ వేగానికి సరిపడా మౌలిక సదుపాయాలు, ముఖ్యంగా రహదారులు, ప్రజా రవాణా వ్యవస్థలు అభివృద్ధి చెందకపోవడం తీవ్రమైన సమస్యలకు దారితీస్తోంది.

నగరాల అభివృద్ధి ఒకవైపు వేగంగా సాగుతుంటే, రవాణా వ్యవస్థలు మాత్రం నత్తనడకన ముందుకు సాగుతున్నాయి. జనాభా పెరుగుదలతో పాటు వాహనాల సంఖ్య విపరీతంగా పెరగడం వల్ల నగరాలు ట్రాఫిక్ కకావికలంగా మారుతున్నాయి. ప్రతి రోజు గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయే పరిస్థితి సాధారణమైపోయింది. ఇది కేవలం సమయనష్టం మాత్రమే కాదు, ఆర్థిక నష్టం, మానసిక ఒత్తిడి, ఆరోగ్య సమస్యలకు కూడా కారణమవుతోంది.

**"వాహన విస్ఫోటనం"..**

మన రాష్ట్రంలో వాహనాల సంఖ్య ప్రతి సంవత్సరం గణనీయంగా పెరుగుతోంది. కానీ రహదారులు, పార్కింగ్ సదుపాయాలు, ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థలు అదే స్థాయిలో అభివృద్ధి చెందడం లేదు. ఈ అసమానత నగరాల్లో ట్రాఫిక్ సమస్యలను మరింత తీవ్రతరం చేస్తోంది. 2025 డిసెంబర్ నాటికి రాష్ట్రవ్యాప్తంగా వాహనాల సంఖ్య 1.81 కోట్లకు చేరుకోవడం ఈ పరిస్థితికి నిదర్శనం. ప్రత్యేకించి ఐటీ, పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఈ ఒత్తిడి మరింత ఎక్కువగా కనిపిస్తోంది. రోడ్ల విస్తరణకు, వాహనాల పెరుగుదలకు మధ్య భారీ అంతరం ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇది కేవలం రవాణా సమస్యగా మాత్రమే కాకుండా పట్టణ ప్రణాళికలో లోపాలుగా కూడా భావించాలి.



**సమస్యలు -పరిష్కారాలు, భవిష్యత్ హెచ్చరిక..!?**

ట్రాఫిక్ రద్దీ పెరగడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పార్కింగ్ కొరత, తరచూ జరిగే రోడ్డు ప్రమాదాలు, వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యం.. ఇవి నగర జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా వాయు కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది.

ఈ సమస్యలకు సమగ్ర పరిష్కారం అవసరం. ముందుగా ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలి. ఆర్టీసీ బస్సులు, లోకల్ రైళ్లు, మెట్రో సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేలా విస్తరించాలి. నగరాల్లో ఎలివేటెడ్ కారిడార్లు, ఫ్లైఓవర్లు నిర్మించడం ద్వారా ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించవచ్చు.

అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కూడా కీలకం. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాలు పెరిగితే నగరాలకు వలసలు తగ్గుతాయి. ఇది నగరాలపై ఒత్తిడిని కొంతవరకు తగ్గిస్తుంది.

"నగరం పరిగెడుతోంది.. ప్రజా రవాణా పడుతూ లేస్తోంది!"మన రాష్ట్ర రాజధాని హైదరాబాదు నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, ప్రజా రవాణా వ్యవస్థ ఆ వేగాన్ని అందుకోలేకపోతోంది. ప్రైవేటు వాహనాల వినియోగం పెరుగుతుండటంతో ట్రాఫిక్ రద్దీ, వాయు కాలుష్యం అధికమవుతున్నాయి. దక్షిణాదిలోని మిగతా మెట్రో నగరాలైన చెన్నై,, బెంగళూరు తో పోలిస్తే హైదరాబాదులో పీఎం10 ఉద్గారాలు అధికం.ఇది భవిష్యత్తులో ఢిల్లీ స్థాయికి చేరే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం ప్రజా రవాణా లోపమే.

మెట్రో సేవలు ప్రారంభమైనప్పటికీ, అవి ప్రజల అవసరాలకు పూర్తిగా సరిపోవడం లేదు. కోచ్‌ల సంఖ్య, సర్వీసుల ఫ్రీక్వెన్సీ పెరగాల్సిన అవసరం ఉంది. అలాగే మెట్రో స్టేషన్ల నుండి చివరి గమ్యస్థానానికి చేరడానికి సరైన కనెక్టివిటీ లేకపోవడం పెద్ద లోపంగా మారింది.

ఎంఎంటీఎస్ (మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్) ఒకప్పుడు కీలక పాత్ర పోషించినా, ప్రస్తుతం దాని వినియోగం తగ్గింది. సమయపాలన లోపం, సర్వీసుల కొరత వల్ల ప్రజలు దానిని విస్మరిస్తున్నారు. అదే సమయంలో సిటీ బస్సుల సంఖ్య కూడా తగ్గడం ప్రజలకు మరింత ఇబ్బంది కలిగిస్తోంది.

**"పరిస్థితి మెరుగుపడుతేనే-సురక్షిత నివాసయోగ్యం"..**

ట్రాఫిక్ మరియు కాలుష్య సమస్యలను తగ్గించడానికి సమగ్ర దృష్టికోణం అవసరం. పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలి. తక్కువ దూరాల కోసం నడక మార్గాలు, సైక్లింగ్ ట్రాక్లు అభివృద్ధి చేయాలి.ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఆధునీకరించి, స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అమలు చేయాలి. పార్కింగ్ నియంత్రణకు కఠిన నిబంధనలు తీసుకురావాలి. డెడికేటెడ్ బస్ కారిడార్లు, యూనిఫైడ్ టికెటింగ్ వంటి చర్యలు ప్రజా రవాణాను మరింత సౌకర్యవంతంగా మారుస్తాయి.

ప్రధాన హెచ్చరికతో కూడిన సూచన..ఇప్పటికైనా సరైన నిర్ణయాలు తీసుకోకపోతే, హైదరాబాదు కూడా ఢిల్లీలా కాలుష్య నగరంగా మారే ప్రమాదం ఉంది. ప్రస్తుతం గాలి నాణ్యత సూచీ (AQI) 120–170 మధ్య ఉండటం ఆందోళనకర విషయం. ఇది మోస్తరు నుండి పూర్ స్థాయికి చేరిన పరిస్థితిని సూచిస్తోంది.పెరుగుతున్న వాహనాల సంఖ్య, ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం అన్నీ కలిపి నష్టం చేకూరుస్తున్నాయి. . ప్రజల ఆరోగ్యం, భవిష్యత్ తరాల భద్రత దృష్ట్యా వెంటనే చర్యలు తీసుకోవాలి. చినుకు పడితే జలదిబ్బంధం, వరద(డ్రైనేజీ)నీరు నిర్వహణ లోపం సరిదిద్దాలి.ఎండాకాలం అగ్నిగుండం పర్యావరణం కాలుష్య నివారణకు చెట్లను పెంచాలి. అలాగే మెట్రో కారిడార్లను విస్తరించడం, ఎంఎంటీఎస్ సేవలను అధిక ఫ్రీక్వెన్సీతో నడపడం, చివరి మైలు కనెక్టివిటీ కోసం ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం అత్యవసరం. పట్టణ ప్రణాళికను శాస్త్రీయంగా అమలు చేస్తూ, సమన్వయంతో కూడిన ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేస్తేనే నగరాలు నివాసయోగ్యంగా మారుతాయి.

మొత్తానికి, నగరాల అభివృద్ధి కేవలం భవనాలు, రోడ్లు నిర్మించడమే కాదు.. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం కూడా అంతే ముఖ్యమైనది. అభివృద్ధి మరియు ప్రణాళిక మధ్య సమతుల్యత లేకపోతే, నగరాలు శ్వాస తీసుకోలేని స్థితికి చేరుకుంటాయి.ఇప్పటి పరిస్థితులు ఒక గట్టి హెచ్చరికగా భావించాలి. తక్షణ చర్యలు తీసుకోకపోతే, రేపటి నగరాలు జీవించడానికి కష్టమైన ప్రదేశాలుగా మారే ప్రమాదం ఉంది. ప్రజా రవాణా బలోపేతం, కాలుష్య నియంత్రణ, గ్రామీణాభివృద్ధి.. ఈ మూడు దిశల్లో సమన్వయంతో ముందుకు సాగితేనే సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం లభిస్తుంది.ప్రభుత్వాలు, నిపుణులు, ప్రజలు.. ముగ్గురూ కలసి పనిచేసినప్పుడే నగరాలు నిజమైన అభివృద్ధి దిశగా పయనిస్తాయి. అప్పుడు మాత్రమే మన నగరాలు ఆరోగ్యకరమైన, సురక్షితమైన, నివాసయోగ్యమైన ప్రదేశాలుగా రూపాంతరం చెందుతాయి.



- మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు,
జిల్లా: వరంగల్,
ఫోన్ :9573666650.

### గౌతమ బుద్ధుడి సూచనలు

మధ్యే మార్గాన్ని అనుసరించండి. ఏ విషయంలోనైనా అతి కాకుండా సమతూల్యతతో ముందుకు సాగండి.



## సంక్షిప్తంగా..

### 30న నృసింహ జయంతి



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** పట్టణంలోని కొల్లాపూర్ చౌరస్తా, నర్సింహపురిలో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో నృసింహ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురుమాత కాశం శెట్టి విజయలక్ష్మి ఆధ్వర్యంలో 30 నుంచి నిర్వహించ నున్నట్లు తెలిపారు. జరిగే ఈ కార్యక్రమంలో పుష్పార్చన, కుంకుమార్చన, అభిషేకం, నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆలయాన్ని పుష్పాలతో శోభాయమానంగా అలంకరించడంతో పాటు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

### చెక్కుతో పాటు తులం బంగారం ఇవ్వాలి



**ముద్ర, కాప్రా:** అర్హులైన పేద ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగపరచుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి కోరారు, కాప్రా ఎమ్మార్వో కార్యాలయంలో మంగళవారం 80 మందికి కల్యాణ లక్ష్మి , షాది ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్కుల పంపిణీ పారదర్శకంగా జరగాలి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా లక్ష నూట పదహారు రూపాయల తో తులం బంగారం ఇవ్వాలి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రాజేష్ కార్యాలయం అధికారులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### షీ టీమ్స్‌పై అవగాహన




**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లాలో షీ టీమ్ ఆధ్వర్యంలో స్కూల్, కాలేజీ విద్యార్థినిలకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా కల్వకుర్తి బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్ (మహాత్మా జ్యోతిబా పూలే), అచ్చంపేటలోని అక్షరం స్టడీ హాల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, తాడూరు మండలంలోని పీఏసీఎస్ సొసైటీ, అలాగే ఉర్కొండలోని సూర్యలత స్పిన్నింగ్ మిల్ వద్ద విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు."మీ రక్షణ మా బాధ్యత" అనే నినాదంతో షీ టీమ్ సభ్యులు బాలికల భద్రత, సైబర్ నేరాలు, వేధింపుల నివారణ, అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలపై వివరించారు. విద్యార్థినులు ధైర్యంగా ముందుకు రావాలని, ఎలాంటి సమస్యలైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో అచ్చంపేట సీఐ నాగరాజు, ఎస్సై సద్దాం, తాడూరు ఎస్సై గురుస్వామి, ఉర్కొండ ఎస్సై, షీ టీమ్ ఎస్సై రజిత, ఏఎస్ఐ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. నాగర్ కర్నూల్ షీ టీమ్ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు, విద్యార్థులు హాజరయ్యారు.

# నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- అభ్యర్థులు హాల్ టికెట్ లోని సూచనలను పక్కాగా పాటించాలి
- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** నీట్ పరీక్షను ఎలాంటి చిన్న తప్పిదం కూడా లేకుండా జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. మే 3వ తేదీన నిర్వహించనున్న నీట్ పరీక్షకు సంబంధించి మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలో మొత్తం 936 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలో నీట్ నిర్వహించే నాలుగు పరీక్ష కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, గతేడాది మాదిరే పరీక్షలను సజావుగా నిర్వహించాలన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్ లోని నిబంధనలను పూర్తిగా అధ్యయనం చేసి అందుకు అనుగుణంగా పరీక్ష రాసేందుకు రావాలని సూచించారు. ఆయా కేంద్రాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి విధిగా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ప్రతి కేంద్రంలో సిఎస్, అబ్జర్వర్లు, ఇతర సిబ్బందితోపాటు తహసిల్దార్ స్థాయి అధికారులు, ఎస్సై, ఒక గన్మెన్, నలుగురు కానిస్టేబుల్స్ తో కూడిన పోలీసులు విధులు నిర్వహించాలన్నారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో ఆపరేషన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద విద్యుత్ సౌకర్యం, సీసీ కెమెరాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, తదితర అన్ని ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు ఆర్టీసీ తరపున సకాలంలో బస్సులను నడపాలన్నారు. దివ్యాంగ అభ్యర్థులకై అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ప్రాథమిక వైద్యం, అంబులెన్స్, ఫైర్ వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఎంతో ప్రాధాన్యతతో కూడిన నీట్ పరీక్షను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం కృషి చేస్తుందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, అదనపు ఎస్పీ శంకర్, ఆర్డీవో శ్రీనివాసరావు, నీట్ సిటీ కోఆర్డినేటర్ దేవేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జన గణన స్వీయ నమోదు చేసుకున్న కలెక్టర్



**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** జన గణన ప్రక్రియలో భాగంగా జిల్లా పాలనాధికారి రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం కలెక్టరేట్ లోని ఛాంబర్లో స్వీయ నమోదు చేసుకున్నారు. జన గణనలో ఎవరికి వారు స్వయంగా వివరాలు నమోదు చేసుకునేలా అందుబాటులోకి తెచ్చిన ఆన్ లైన్ వెబ్ సైట్ ద్వారా తన వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జన గణన ప్రక్రియను సులభంగా, సమగ్రంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం డిజిటల్ స్వీయ గణన విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. ఆన్లైన్ ద్వారా ప్రజలు తమ వ్యక్తిగత, కుటుంబ వివరాలను వెబ్ పోర్టల్ లో కానీ, మొబైల్ యాప్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించారని తెలిపారు. ప్రజా ప్రతినిధులు అధికారులు ప్రతి ఒక్కరు ఈ మొబైల్ యాప్ ద్వారా వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 26 నుంచి మే 10 వరకు స్వీయ నమోదు చేసుకోవచ్చని సూచించారు. జన గణనకు సంబంధించిన సమాచారాన్ని 15 నిమిషాల వ్యవధిలో పూర్తి చేసుకోవచ్చన్నారు.

# జీవితంలో అనుకున్నది సాధించాలి

- చిన్న వయసులో పెళ్లిళ్లు వద్దు
- తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు
- కలెక్టర్ సీ.హెచ్. ప్రియాంక





**ముద్ర, నారాయణపేట :** ఎలాంటి పరిస్థితుల్లోనైనా తొందర పాటు నిర్ణయం తీసుకోరాదని చిన్న వయస్సులో పెళ్లి చేసుకోకుండా ఉన్నత చదువులు చదివి జీవితంలో అనుకున్నది సాధించాలని కలెక్టర్ సీ.హెచ్. ప్రియాంక సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాలలో భాగంగా మంగళవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కౌమార బాలికల గర్భధారణ సమస్యలపై, ఇంటి నుంచి పారిపోవడం అనే అంశంపై జిల్లా బాలల సంరక్షణ విభాగం మద్దూరు రైతు వేదికలో కిశోర బాలికలతో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒక్క నిర్ణయం జీవితాన్నే మార్చేస్తుందని, ఎలాంటి పరిస్థితుల్లోనైనా తొందర పాటు నిర్ణయం తీసుకోరాదని చెప్పారు. తాను హాస్టల్ లో చదువుకునే రోజుల్లో తన రూమ్ మెట్ ఒక అమ్మాయి వాళ్ల అమ్మకు ఆరోగ్యం బాగా లేదని చదువు ఆపేసి పెళ్లి చేసుకుందని, ఇప్పుడు ఆమె ఇద్దరు పిల్లలతో సాధారణ గృహిణిగా జీవనం సాగిస్తోందని, అదే చిన్న వయసులో పెళ్లి చేసుకోకుండా ఉంటే చదువుకుని ఉంటే ఇప్పుడు ఆమె ఎంతో ఉన్నత స్థాయి ఉద్యోగంలో ఉండేదని కలెక్టర్ చెప్పారు. అలాగే 2012 లో తాను డిప్యూటీ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఒక కౌమార దశ బాలిక ప్రేమ పేరిట ఆకర్షణకు గురైతే స్వయంగా తానే పోలీసులు, అంగన్ వాడీ సీడీపీవోలకు సమాచారం ఇచ్చి బాల్య వివాహాన్ని అడ్డుకున్నానని అప్పటి జ్ఞాపకాలను కలెక్టర్ విద్యార్థినులతో పంచుకున్నారు. కౌమార దశలో ప్రేమ, ఇష్టం, అభిమానం అనేవి కేవలం ఆకర్షణ అని, విద్యార్థినులు వాటికి దూరంగా ఉండాలని కలెక్టర్ హితవు చెప్పారు. బాలికలు మంచిగా చదువుకుని జీవితంలో సెట్ కావాలని అప్పుడే ఆ తర్వాత జీవితం ప్రశాంతంగా ఉంటుందన్నారు. బాల్యవివాహాల నిరోధక చట్టం, బాలలపై జరిగే లైంగిక దోపిడీ నుంచి రక్షణ చట్టాల గురించి, ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సోషల్ మీడియా ప్రభావం గురించి బాలికలకు అవగాహన కల్పించారు. ప్రతి బాలిక వాళ్లు అనుకున్న లక్ష్యాన్ని సాధించే విధంగా చదువుకోవాలని జీవితంలో ఆర్థిక స్థిరత్వం సాధించడం వల్లనే ఏదైనా సాధ్యపడుతుందని, చదువుపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.

## జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వర్షం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూలు:** జిల్లాలో సాయంత్రం సమయంలో వాతావరణం అకస్మాత్తుగా మారి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో బలమైన గాలులతో కూడిన వర్షంతో వృక్షాలు నేలకొరిగిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అకాల వర్షంతో అన్నదాతల ఆందోళన మొక్కజొన్న పంట వర్షంలో తడిసి ముద్దయింది జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నిల్వ ఉంచిన మొక్కజొన్న పంట వర్షానికి తడిసిపోవడంతో రైతులకు గట్టి దెబ్బ తగిలింది. కోతల సమయంలో వచ్చిన ఈ వర్షం రైతుల కష్టానికి నీరాజనం పోసినట్లైంది.ఇక పొలాల్లో ఉన్న పంటలు కూడా తడిసిపోవడంతో నష్టభయం నెలకొంది. ఇప్పటికే చేసిన పెట్టుబడులు తిరిగి వస్తాయా లేదా అన్న అనిశ్చితి రైతులను వెంటాడుతోంది. వరుణుడి అకస్మాత్తు రాకతో వ్యవసాయ పనులు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి.ఈ పరిస్థితుల్లో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం లేకుండా బయటకు రావొద్దని అధికారులు సూచించారు.

## బిజీ బిజీగా కలెక్టర్ పర్యటన

**ముద్ర, నారాయణపేట:** నారాయణపేట జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు తీసుకున్న రెండో రోజు కలెక్టర్ ప్రియాంక బిజీబిజీగా మంగళవారం అధికారిక కార్యక్రమాల్లో పర్యటించారు. మద్దూరు రైతు వేదికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాల నష్టాలు ఇతర అంశాలపై జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. సింగారం వద్ద వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఆ తర్వాత స్వీయ గణన కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్లో జరిగిన ప్రెస్ మీట్ లో పాల్గొన్నారు. అలాగే కలెక్టరేట్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మహిళా పెట్రోల్ బంక్ పనితీరును ప్రశంసిస్తూ జెడ్ ఎం ఎస్ సమావేశంలో పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్లు ఫణీంద్ర రెడ్డి, శ్రీనుతో కలిసి కలెక్టర్ ఎస్. ఐ.ఆర్, సాదా బైనామా పై తహసీల్దార్లు, డీటీలు, సూపర్ వైజర్లు, ఏ ఈ ఆర్ వో లతో సమీక్ష జరిపి సాదా బైనామా, భూ భారతి దరఖాస్తుల పై తహసిల్దార్ల తో చర్చించారు.

## ఉద్యమ కళాకారుల సమస్యలు పరిష్కరిస్తాం



**ముద్ర, కాప్రా:** తెలంగాణ ఉద్యమ కళాకారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆయన మంగళవారం తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ప్రీతం మాట్లాడుతూ నిరుద్యోగ కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కార మార్గం చూపేందుకు కృషి చేస్తానన్నారు.బాషా సాంస్కృతిక శాఖ సలహాదారు దరువు అంజన్న మాట్లాడుతూ ఉద్యమ కళాకారుల ఆవేదన న్యాయబద్ధమైనదేనని, ప్రజా ప్రభుత్వం వారి కోరికలను తప్పక నెరవేర్చుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.సమావేశంలో సంఘం రాష్ట్ర చైర్మన్ అనువోజ్ వెంకటేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ నకిరేకంటి కిరణ్, ఉపాధ్యక్షులు జువాజి ప్రవీణ్, పేరాల యాదగిరి, కోంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి అభివృద్ధికి కట్టుబడి ఉన్నా



**ముద్ర, మల్కాజిగిరి:** మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు మౌలాలి, నేరేడ్‌మెట్, యాప్రాల్ ప్రాంతాల్లో సుమారు రూ. 2.62 కోట్ల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ , సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్ల పరిధిలోని కాలనీలలో కనీస సదుపాయాలైన డ్రైనేజీ, సిసి రోడ్లు, మంచినీటి సమస్యల పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ , జలమండలి అధికారులతో పాటు స్థానిక కాలనీవాసులు, బీఆర్ఎస్ నాయకులు కలిసి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో నిర్వహించిన మల్లన్న జాతర, రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నాణ్యత ప్రమాణాలు పాటించాలి




**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** పట్టణంలోని స్ట్రీట్ ఫుడ్ విక్రేతలు తప్పనిసరిగా పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించాలని అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ ఆనందరావు సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని హిమాలయ హోటల్‌లో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో స్ట్రీట్ ఫుడ్ విక్రేతలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ పాలు, నూనె తదితర ఆహార పదార్థాల్లో కల్తీ జరుగుతున్నట్లు గుర్తించామని తెలిపారు. అదేవిధంగా స్ట్రీట్ ఫుడ్ విక్రేతల వద్ద పరిశుభ్రత లోపిస్తున్నదని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. వినియోగదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి విక్రేత నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో సుమారు 100 మంది ఫుడ్ వెండర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, నెస్లే కంపెనీ ప్రతినిధి వసీం అహ్మద్, సీనియర్ మేనేజర్ రోషన్ కుమార్ చౌదరి, ఫుడ్ సేఫ్టీ మహబూబ్‌నగర్ అధికారి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## భరోసా సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో భరోసా సెంటర్ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సన్ షైన్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్, భవాని కంప్యూటర్స్, ఐసీడీఎస్ నాగర్ కర్నూల్ సెక్టార్ పరిధిలో జరిగింది.ఈ సందర్భంగా భరోసా సెంటర్ కోఆర్డినేటర్ శ్రీలత జెండర్ ఆధారిత వివక్షపై వివరించారు. లింగ సమానత్వం, మహిళల హక్కులు, పోక్సో చట్టం, అలాగే బ్యాడ్ టచ్ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా బాలల భద్రతపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఆర్డీవో, ఎంఆర్ఓ, మునిసిపల్ కమిషనర్, అంగన్వాడీ సూపర్ వైజర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు పూర్తి

**ముద్ర, కుషాయిగూడ :** కుషాయిగూడ బస్ స్టాప్ ప్రాంతంలో హనుమాన్ విగ్రహ నిర్మాణ సమితి ఆధ్వర్యంలో, కుషాయిగూడ బజరంగ్ దళ్, వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో నిర్మిస్తున్న 54 అడుగుల భారీ హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి రంగం సిద్దమైంది. మే 1, శుక్రవారం వైశాఖ శుద్ధ పౌర్ణమి, స్వాతి నక్షత్ర సమూహూర్తంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారీ హనుమాన్ విగ్రహంతో పాటు మూలవిరాట్ కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి, వినాయక విగ్రహాల యంత్ర మంత్ర ప్రాణ ప్రతిష్ట నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం దేవత మూర్తుల గ్రామోత్సవం ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. 29వ తేదీన ఉదయం, సాయంత్రం హోమాలు, దేవతామూర్తుల జలాధివాసం, 30వ తేదీ గురువారం ఉదయం, సాయంత్రం హోమాలు, ధాన్యాధివాసం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ప్రతిష్ట కార్యక్రమాలను శ్రీ హంపి వీరుపాక్ష విద్యారణ్య భారతి స్వామి, శ్రీ యోగానంద సరస్వతి స్వామి శ్రీత్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి, శ్రీ చిట్టి పెద్ది రామశర్మ గారి ఆధ్వర్యంలో వైదిక బ్రాహ్మణులు యంత్ర మంత్ర ప్రాణ ప్రతిష్టగా నిర్వహించనున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 29.04.2026
www.mudranews.in | @mudranews



గౌతమ బుద్ధుడి సూచనలు:

అహింసను జీవన విధానంగా మార్చుకోండి. ఎవరికీ హాని కలగ కూడదనే భావనతో ఉండండి.



# కరీంనగర్ లో కర్మకాండ నిలయాలు

**- నాలుగు భవనాలు నిర్మించాలని మున్సిపల్ పాలకవర్గానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచన**

**- శ్మశాన వాటికల సమీపంలో అనువైన స్థలాలను పరిశీలించిన కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్**



**ముద్ర, కరీంనగర్:** కరీంనగర్ లో చాలా చోట్ల కిరాయి ఇళ్లల్లో నివసిస్తున్న కుటుంబాల్లో ఎవరైనా చనిపోతే ఆ వ్యక్తి అంత్యక్రియలు ముగిసే వరకు ఇంటి యజమానులు రానివ్వని దుస్థితి నెలకొంది. అసలే సొంత ఇల్లు లేని పేదలు అప్పటిదాకా లాడ్జిల్లో బస చేసేంత ఆర్థిక స్తోమత ఉండదు. అట్లాగని ఇంట్లోకి వెళ్ల లేరు. కొంత మంది బంధువుల ఇండ్లకు వెళితే... కర్మకాండ ముగిసే వరకు శ్మశాన వాటికల్లో భార్యాపిల్లలతో బతుకు వెళ్లదీయాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి కథనాలు వార్తా పత్రికల్లో నిత్యం వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇకపై కరీంనగర్ లో ఎవరూ ఇలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గానికి సూచించారు. అందులో భాగంగా కరీంనగర్ లో నాలుగు దిక్కుల 4 కర్మకాండ నిలయాలను నిర్మించి అందుబాటులోకి తేవాలని కోరారు. శ్మశాన వాటికలకు సమీపంలో ఈ కర్మకాండ నిలయాలను నిర్మిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

కేంద్ర మంత్రి సూచన మేరకు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు వారం రోజుల క్రితం కరీంనగర్ లోని సిరిసిల్ల, జగిత్యాల, మంచిర్యాల, హైదరాబాద్, వరంగల్ రహదారుల్లో ఉన్న శ్మశాన వాటికలను సందర్శించారు. ఆయా శ్మశాన వాటికల సమీపంలో కర్మకాండ నిలయాలు నిర్మాణానికి అనువైన స్థలాలపై ఆరా తీశారు. అందులో భాగంగా మార్కండేయ నగర్ శ్మశాన వాటిక, కరీంనగర్ ఓల్డ్ సిటీ కేబుల్ బ్రిడ్జి సమీపంలోని శ్మశాన వాటిక, అల్కాపురి శ్మశాన వాటిక సమీపం, జగిత్యాల రోడ్డులోని రేకుర్తి శ్మశాన వాటిక, మంచిర్యాల రోడ్డులోని శ్మశాన వాటికల సమీప స్థలాలను పరిశీలించారు.

స్థలాల ఎంపిక పూర్తయితే జీ+1 పేరిట కరీంనగర్ నలు దిక్కుల 4 కర్మకాండ నిలయాలను నిర్మించాలని నిర్ణయించారు. కరీంనగర్ కార్పొరేషన్ లో నిధుల కొరత లేనందున సాధ్యమైనంత తొందర్లో స్థలాలను ఎంపిక పనులను ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. ఒక్కో కర్మకాండ నిలయానికి రూ.50 లక్షల చొప్పున వ్యయం చేయాలని భావిస్తున్నారు. కరెంట్, నీటి వసతి, బస చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ ఈ కర్మకాండ నిలయాల్లో కల్పించనున్నారు. ఈ కర్మకాండ నిలయాలు అందు బాటులోకి వస్తే కిరాయి ఇండ్లల్లో నివసి స్తున్న కుటుంబాలకు ఊరట కలగనుంది. కుటుంబ సభ్యులు చనిపోయిన నాటి నుండి కర్మకాండలు ముగిసే వరకు గరిష్టంగా 13 రోజులపాటు కర్మకాండ నిలయాల్లో ఆశ్రయం పొందవచ్చు. ఉచితంగా ఆశ్రయం కల్పించడంకంటే కిరాయిదారులపై భారం పడకుండా నామమాత్రం రుసుం చెల్లించేలా ఫీజు నిర్ణయించాలని భావిస్తున్నారు. దీనిపై త్వరలోనే కరీంనగర్ కార్పొరేషన్ పాలకవర్గం నిర్ణయాన్ని వెలువరించనుంది. ఈ సందర్భంగా కరీంనగర్ మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ లో నలు దిక్కుల 4 కర్మకాండ నిలయాలను నిర్మించి ఆశ్రయం కల్పించాలనే ప్రతిపాదనలను రూపొందించినట్లు తెలిపారు. త్వరలోనే స్థలాల ఎంపికను పూర్తి చేసి కర్మకాండ నిలయ భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు.

## పుష్కరాల పనులపై మంత్రి సమీక్ష



**ముద్ర, ధర్మపురి:** గోదావరి పుష్కరాలు, లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధిపై మంగళవారం సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ ధర్మపురిలోని తన క్యాంప్ ఆఫీస్ లో కలెక్టర్ సత్యప్రసాద్‌తోపాటు పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు, లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. 2027లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలన్నారు. అధికారులు ఇప్పటికే రూపొందించిన ప్రణాళికలు మరోసారి సమీక్షించాలన్నారు. పుష్కరాలకు కావాల్సిన నిధుల కోసం త్వరలోనే ముఖ్యమంత్రిని కలుస్తానన్నారు. రాయపట్నం నుంచి ధర్మపురి వరకు ఉన్న నేషనల్ హైవే – 63 అభివృద్ధి పనులకు నిధుల మంజూరుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్గరీతో సమావేశమవుతామని తెలిపారు. భూసేకరణకు ఉన్న ఇబ్బందులను స్థానికులతో చర్చించి ఆ ప్రక్రియ పూర్తయ్యే విధంగా నేతలు చొరవ తీసుకోవాలని మంత్రి సూచించారు.

## విద్యార్థులు నిరాశ పడొద్దు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** అనుత్తీర్ణతతో విద్యార్థులు నిరాశ పడొద్దని, మరింత పట్టుదలతో ముందుకు సాగాలని కలెక్టర్ భవేష్ మిశ్రా విద్యార్థినులకు దిశా నిర్దేశం చేశారు. ఇంటర్ లో అనుత్తీర్ణులైన విద్యార్థుల కోసం నిర్మల్ సోఫీనగర్ కేజీబీవీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. జీవితంలో అనుత్తీర్ణత అంతిమం కాదన్నారు. భయాన్ని విడనాడి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని ప్రోత్సహించారు. పలు సబ్జెక్టులకు సంబంధించిన మెలుకువలను ఆయన విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ రాజు, ఎంఈఓ సిద్ద పద్మ, కేజీబీవీ ప్రత్యేక అధికారి సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువతి వివాహానికి చేయూత



**ముద్ర, కోరుట్ల:** కోరుట్ల మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన బత్తుల లక్ష్మి – అశోక్ ల కూతురు లావణ్య వివాహానికి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనందించింది. పెళ్లి కోసం 120 మందికి సరిపోయే భోజన సరుకులు, పెళ్లి కూతురికి పట్టుచీర అందించారు. స్థానిక సర్పంచ్ దేశబోయిన జమునా సంజీవ్, ఉపసర్పంచ్ జైడి కిషోర్. జగ్గాసాగర్ సర్పంచ్ పుల్ల జగన్, అమ్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పుల్ల శ్రీనివాస్ చేతుల మీదుగా పెళ్లి కూతురికి అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు శ్రీనివాస్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి తమ ట్రస్ట్ అండగా నిలుస్తుందన్నారు. అనంతరం గ్రామస్థులు ట్రస్ట్ సభ్యులను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో చిలుక తుకారాం, ఏలేటి నారాయణ రెడ్డి, క్యాతం సుభాష్, మారుతి, సాగర్, అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## తొలకరికి ముందే జీలుగ సాగు చేయాలి



**ముద్ర, కరీంనగర్:** తొలకరి వర్షాలకు ముందే జీలుగ, జనుము వంటి పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయాలని కేవీకే రామగిరి ఖిల్లా సాయిల్ సైన్స్ శాస్త్రవేత్త కిరణ్ సూచించారు. కమాన్ పూర్ మండలంలోని నాగారం రైతు వేదికలో మంగళవారం సమతుల్య ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రీయ సాగు పద్ధతుల ప్రాధాన్యతను వివరించేందుకు ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా సూక్ష్మ, స్థూల పోషకాలను సమతుల్యంగా అందిస్తే దిగుబడి పెరిగి నేలలు సారవంతంగా ఉంటాయని తెలిపారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ వరి గడ్డిని తగలబెట్టడం వల్ల భూసారం తగ్గుతుందన్నారు. నీటి వసతి ఉన్న రైతులు గడ్డిని కుళ్లబెట్టి పచ్చిరొట్టను ఎరువుగా వినియోగించాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించాలి



**ముద్ర, కరీంనగర్:** ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించాలని చిగురుమామిడి ఎంపీడీవో విజయ్ కుమార్ సూచించారు. చిగురుమామిడి మండలంలోని రేకొండ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద లబ్ధిదారులతో మంగళవారం సర్పంచ్ అల్లెపు సంపత్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు మే 24 లోపు పూర్తిచేయాలన్నారు. చిగురుమామిడి మండలంలో 341 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. 38 ఇళ్లు పూర్తి స్థాయిలో నిర్మాణాలు అయినాయని, మిగతావి చివరి దశలో ఉన్నాయనన్నారు. రేకొండలో 36 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా, 27 స్లాబ్ వరకు పూర్తయ్యాయనన్నారు. త్వరితగతిగా పనులు పూర్తిచేయాలని లబ్ధి దారులను కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి అజయ్ కుమార్, ఇందిరమ్మ కమిటీ సభ్యురాలు రొంటాల లావణ్య, కానవేణి శ్రీనివాస్, లబ్ధిదారులు కుంట రేణుక, కాశవేణి నీలవ్వ, నెల్లి అరుణ, తీగల జయసుధ, మోర వెంకటలక్ష్మి, గోపగోనీ సునీత, కనకం మమత, గౌరిశెట్టి భాగ్యలక్ష్మి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

**ముద్ర, కరీంనగర్:** గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని రామగుండం మేయర్ మహంకాళి స్వామి సూచించారు. గోదావరిఖని లోని అడ్డగుంటపల్లి ఫంక్షన్ హాల్ లో మంగళవారం ఈసీసీఈ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అక్షరభ్యాసం పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి ప్రగతి పత్రాలను అందజేశారు. గర్భిణులకు సీమంతాలు చేసి పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులకు సృజనాత్మకతతో కూడిన విద్య అందించడానికి అంగన్ వాడీ కేంద్రాలు దోహద పడుతాయన్నారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు అంగన్ వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గట్ల రమేష్, సీడీపీఓ అలేఖ్య పటేల్, పర్యవేక్షకులు మమత, షరీస్, ఎన్జీవో లిటిల్, అంగన్వాడీ టీచర్లు రజిత, మత, శారద, శైలజ, రమతోపాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు కలగొద్దు

**- మంత్రి పొన్నం ప్రభాకర్**



**ముద్ర, కరీంనగర్:** ధాన్యం సేకరణ పూర్తయ్యే వరకు రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆదేశించారు. మంగళవారం కరీంనగర్ జిల్లాలోని సైదాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో మండల, జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమ స్యలు రాకుండా సంబంధిత శాఖ అధికా రులు దృష్టి సారించాలని స్పష్టం చేశారు. వేసవి ముగిసేవరకు ఎక్కడా తాగునీటి సమ స్య తలెత్తకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంది రమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు ఇబ్బందులు జరగకుండా చూస్తున్నా మని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తనాజీ వాకిడే, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ రమేశ్, సైదాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొంత సుధాకర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో యాదగిరి, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, పలు శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఇబ్బందులు రావద్దు

**- నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా**




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** పెట్రోల్, డీజిల్ సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు రానీయవద్దని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరాపై ఎస్పీ జానకి షర్మిలతో కలిసి మంగళవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలోని పెట్రోల్ బంకుల వివరాలు, రోజువారీ అమ్మకాల వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు వచ్చిన స్టాక్, అమ్మిన స్టాక్, మిగిలిన స్టాక్ వివరాలు డైలీ స్టాక్ రిజిస్టర్ లో తప్పనిసరిగా నమోదు చేయాలని పేర్కొన్నారు. ఎవరికి కూడా అవసరానికి మించి పెట్రోల్, డీజిల్ ఇవ్వరాదన్నారు. పెట్రోల్, డీజిల్ అక్రమ రవాణా, నిల్వ చేయకూడవద్దని చెప్పారు. కృత్రిమ కొరత సృష్టించరాదని పేర్కొన్నారు. అంతరాష్ట్ర సరిహద్దుల వద్ద పెట్రోల్, డీజిల్ అక్రమ రవాణా పై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. ప్రజల అవసరాల మేరకు పెట్రోల్, డీజిల్ సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్, ఏఎస్పీలు అజ్మీరా సంకేత్ కుమార్, సాయి కిరణ్, ఆర్డీవో రత్నకళ్యాణి, పౌర సరఫరాల అధికారి రాజేందర్, డీఎంహెచ్ఓ రాజేందర్, బీసీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు శ్రీనివాస్, అంబాజీ, మోహన్ సింగ్, వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, డీపీఆర్ఓ విష్ణువర్ధన్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి



**ముద్ర, కరీంనగర్:** రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని జగిత్యాల వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ తిరుపతి సూచించారు. మంగళవారం కరీంనగర్ జిల్లాలోని శంకరపట్నం మండలం మొలంగూర్ రైతు వేదిక భవనంలో అన్నదాతలకు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ విధానాల సాగుతోనే రైతులకు లాభం చేకూరుతుందని తెలిపారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి వైవిధ్యీకరణతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వెంకటేష్, వ్యవసాయ శాస్త్రవేత్త రాణి, ఉద్యానవనాధికారిణి రవళి, సర్పంచ్ రాజు, ఉప సర్పంచులు రాజేష్, సుభాష్ రెడ్డి, ఏఈఓ కీర్తన పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
29.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



గౌతమ బుద్ధుడి సూచనలు

ఆశలను నియంత్రించండి. దురాశే చాలా దుఃఖాలకు మూలమని గుర్తించండి.






## సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు : ఆర్డీవో

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

జిల్లాలో సరిపడ పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని ఆర్డీఓ రమాదేవి తెలిపారు. మంగళవారం మెదక్ పట్టణంలో తహసిల్దార్ లక్ష్మణ్ బాబుతో కలిసి పెట్రోల్ పంపులు పరిశీలించారు. ప్రస్తుతం పెట్రోల్ నిల్వ 29,232 లీటర్లు, డీజిల్ నిల్వ 26,667 లీటర్లు ఉన్నాయన్నారు. వినియోగదారులు ఆందోళన చెన్సల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అనంతరం మెదక్ మండలం రాజ్ పల్లిలో పాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శించారు. గన్ని సంచుల వివరాలు, తాగునీటి సౌకర్యం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు 1200 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశామని సిబ్బంది తెలిపారు. ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని ఈ సందర్భంగా సిబ్బందికి సూచించారు.

## స్వీయ జన గణన నమోదు చేసుకున్న కలెక్టర్

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



జనగణన డిజిటల్ నమోదులో భాగంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ కలెక్టలోని కలెక్టర్ సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకున్నారు. తన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ... ఈ నెల 26 నుండి మే 10 వరకు సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా స్వయంగా వివరాలు నమోదు చేసుకోవడం వల్ల ప్రజల సమయం ఆదా అవుతుందని, ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని సూచించారు. మే 11వ తేదీ నుండి ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి వచ్చి వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఆ సమయంలో ముందుగా సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసిన వారు నమోదు సమయంలో పొందిన ఐడి నంబర్ తెలియచేయాలని సూచించారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసిన ప్రతి ఒక్కరూ ఐడి నంబర్‌ను జాగ్రత్తగా భద్రపరచుకోవాలని సూచించారు.జిల్లా ప్రజలు అందరూ బాధ్యతతో పాల్గొని జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఆదేశాలు రాగానే పొద్దు తిరుగుడు కొనుగోలు చేస్తాం

- **కలెక్టర్ హైమావతి**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

మిరుదొడ్డి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ, తోగుట మండలం బండారు పల్లి గ్రామంలోని వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మీరుదొడ్డి మార్కెట్ కమిటీలో పొద్దుదిరుగుడు కొనుగోలు చెయ్యాలని స్థానిక రైతులు కోరగా పొద్దుదిరుగుడు కొనుగోలు రాష్ట్ర స్థాయి అధికారులను ఇదివరకే సంప్రదింపులు జరిపినట్లు వారి అనుమతి రాగానే వెంటనే కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు.జిల్లాలో 419 ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు టెంట్, కుండలో తాగునీరు, తాలు తీసే యంత్రాలు, వేయింగ్ మిషన్స్, టార్పాలిన్ కవర్లు, సుతిల్ దారాలు, గన్ని బ్యాగులు ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. తేమ శాతం వచ్చే వరకు రైతులు వ్యవసాయ క్షేత్రాల వద్దనే అరబెట్టుకోవాలని, తప్పనిసరిగా తాలు తీసిన వరి ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఇట్టి విషయాన్ని గమనించాలని తెలిపారు. అక్కడక్కడ కొన్ని కేంద్రాల్లో తాలు తియ్యకుండా వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు వస్తున్న సమాచారం అవాస్తవం అని తెలిపారు. తాలు తీసాకే ధాన్యానికి గ్రేడ్ ఇవ్వాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

## 'ఆడపిల్లలను వేధిస్తే కఠిన చర్యలు'

**ముద్ర న్యూస్ :**

ఆడపిల్లలను వేధిస్తే నూతన చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని షీ టీం సభ్యులు పార్వతి, అనిల్ అన్నారు. మంగళవారం నస్రుల్లాబాద్ మండలం దుర్కి శివారులోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో షీ టీంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళల భద్రత, వేధింపులను నివారించడం, లింగ వివక్షత, బాల్య వివాహలు, లైంగిక వేధింపులు, అక్రమ రవాణాపై చట్టపరంగా తీసుకునే అంశాలను విద్యార్థినులకు వివరించారు. ఆడపిల్లల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించడం, ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే 8712686096 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని వారు సూచించారు. ఆడపిల్లలు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి (టీ సేఫ్) యాప్‌ను ఉపయోగించాలన్నారు. ప్రిన్సిపల్ అనీ ప్రణుతి, వైస్ ప్రిన్సిపల్ మెర్సీ, అధ్యాపకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయండి

- **కలెక్టర్ హైమావతి**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

మే 3వ తేదీన నీట్ 2026 ఆఫ్ లైన్ లో జరగబోయే పరీక్షకు సంబంధించి జిల్లాలోనీ రెండు పరీక్షా కేంద్రాల్లో నిర్వహణ గూర్చి జిల్లా కలెక్టర్ కె. హైమావతి సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. యూజీసీ నీట్ 2026 ఆఫ్ లైన్ పరీక్ష మే3 వ తేదీన మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జిల్లా కేంద్రంలో 2 సెంటర్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించే 937 మంది విద్యార్థులు పరీక్ష రాయనుండగా దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) మార్గదర్శకాల ప్రకారం సెంటర్ లను ఎంపిక చేసి ఆ సెంటర్ లో సీసీ కెమెరా, పవర్ సప్లై, వాటర్ ఫెసిలిటీ, ఫర్నిచర్, టాయిలెట్స్ ఇతరత్రా అన్ని సౌకర్యాలు ముందస్తుగా చెక్ చేయాలని అధికారులను ఆదేశించారు. మే 2, 3 వ తేదీన రెండు సెంటర్లలో ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండా చూసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను, వైద్య శిబిరం ఏర్పాటు చెయ్యాలని డిఎంఅండ్ఎచ్ఓకి, విద్యార్థులకు సకాలంలో సెంటర్కు చేరుకునేలా అదనపు బస్సులు నడపాలని ఆర్టీసీ డిఎం ను ఆదేశించారు. పరీక్ష రోజు స్ట్రాంగ్ రూమ్ నుండి ఎగ్జామ్స్ సెంటర్ కు పరీక్ష పేపర్లను ఎస్కార్ట్ సహాయంతో తీసుకురావాలని అలాగే రెండు సెంటర్లలో ఫ్రిస్కింగ్, చుట్టూ 144 సెక్షన్ అమలు చేస్తూ పకడ్బందీగా బందోబస్తు నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పరీక్ష రాసే 937 విద్యార్థులు అలాట్మెంట్ కార్డు, ఒరిజినల్





రెండు పాస్ ఫొటోస్, ఒరిజినల్ గుర్తింపు కార్డు మాత్రమే తీసుకురావాలని మిగతా ఎలాంటి వస్తువులు తీసుకురావద్దని సూచించారు. ఈ సమావేశం లో అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, డిఆర్ఓ నాగరాజమ్మ, ఏఓ రాజ్ కుమార్, కెవి ప్రిన్సిపల్ సూర్య ప్రకాష్, నవోదయ స్కూల్ ప్రిన్సిపల్ రాజేందర్, ఈ డి ఎం ఆనంద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

## గ్రామ గ్రామాన 'మేడే' ను జయప్రదం చేయండి

- **సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపు.**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే ను జిల్లాలోని అన్ని గ్రామాలలో ఎర్రజెండాలు ఎగరవేసి జయప్రదం చేయాలని గ్రామాలలో కార్మికుల, ప్రజల హక్కులు ప్రతిబింబించేలా ప్రదర్శనలు సభలు నిర్వహించాలని సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కార్మికులు, రైతులు, కూలీలు, శ్రామిక ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యాలయం కార్మిక కర్షక భవనంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ 1886 మే 1వ తేదీన అమెరికాలోని చికాగో నగరం హే మార్కెట్లో ఎనిమిది గంటల పని దినం, కనీస వేతనాలు అమలు, కార్మిక సంఘాలను హక్కుల కోసం నిర్మాణం, చేసుకునే హక్కుల కోసం ప్రపంచ కార్మికులంతా ఏకమై పోరాడి ప్రాణ త్యాగాలు చేసి హక్కులు సాధించుకున్న రోజు ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే అని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను హరించివేస్తూ ఎనిమిది గంటల పని దినం స్థానంలో 12 నుంచి 16 గంటలు పనిచేసే విధంగా, కనీస వేతనాలు అమలు చేయకుండా పెట్టుబడిదారులకు అనుకూలంగా వివరిస్తూ, కార్మిక సంఘాలను పెట్టుకునే , సమ్మె చేసే హక్కు లేకుండా కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దు చేసిందని మండిపడ్డారు. దాని స్థానంలో కార్మిక వర్గాన్ని ప్రజలను దోచుకునే విధంగా నాలుగు లేబర్ కోడులను తీసుకువచ్చి కార్మికుల హక్కులపై దాడి చేస్తుందని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా బడ్జెట్లో కేటాయింపులు తగ్గించి పని దినాలను తగ్గించి అనేక అంక్షలు పెట్టి గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ చట్టం పేరుని మార్చేసి చట్టం ఉద్దేశాన్ని నిర్వారిస్తుందని పేదల నోటికాడి బుక్కను లాక్కుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగానికి వ్యతిరేకంగా సాగు వ్యతిరేక చట్టాలను తీసుకువస్తూ కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రవేశపెడుతూ బహుళజాతి సంస్థలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తూ నూతన విత్తన చట్టాన్ని తీసుకువస్తుందని ఇది రైతాంగాన్ని వ్యవసాయం నుండి దూరం చేసే చర్యలని ఈ విధానాల అనుసరించడం మూలంగా రైతులు కూలీలు కార్మిక వర్గం బజారున పడే పరిస్థితులు వచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక చట్టాలను చేస్తూ ప్రభుత్వరంగాన్ని ధ్వంసం చేసి ప్రైవేటుపరం చేయడానికి కార్పొరేట్ శక్తులకు తలుపులు బార్ల తెరిచారని ఈ విధానాల వలన అన్ని వర్గాల ప్రజలపై భారాలు పడుతున్నాయని ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే స్ఫూర్తితో ప్రజల హక్కుల పరిరక్షణ కోసం రాజ్యాంగ పరిరక్షణ కోసం ఉద్యమించాలని గ్రామ గ్రామాన ఎర్రజెండాలు ఆవిష్కరించాలని ఈ 140 వ మేడేలో ప్రజల పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్, కాముని గోపాల స్వామి, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో, బండ కింది అరుణ్ కుమార్, నాయకులు తేలు ఇస్తారి, శ్రీశైలం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

### మేడేను జయప్రదం చేయండి

- **సిఐటీయు జిల్లా కార్యదర్శి మల్లేశం**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

వాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడుదాం.. కార్మిక హక్కులు కాపాడుకుందాం అని సిఐటీయు మెదక్ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం జిల్లాలోని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. మే 1న మే డే సందర్భంగా జిల్లాలోని 492 గ్రామాలలో సిఐటీయు కార్మిక జెండాలు ఎగురవేయాలని, అన్ని మండల కేంద్రాలలో ర్యాలీలు, సభలు నిర్వహించాలని ఆయన పిలునిచ్చారు. మంగళవారం మెదక్ కేవల్ కిషన్ భవనంలో మేడే వారోత్సవాల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు జిల్లా కోశాధికారి కే.నర్సమ్మ, సహాయ కార్యదర్శి జె సంతోష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె. మల్లేశం పాల్గొన్నారు.





## కొనుగోలు కేంద్రం నిర్వహణలో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం

**ముద్ర న్యూస్ :**

ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణలో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఇలా త్రిపాఠీ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల అలసత్వం వహించడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ, భీంగల్ మండల ఐకేపీ ఏపీఎంకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిజామాబాద్ జిల్లాలోని భీంగల్ మండలం పల్లికొండ, భీంగల్ గ్రామాల్లో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి సందర్శించారు. ఈ సందర్భంగా పల్లికొండ కొనుగోలు కేంద్రం నిర్వహణలో లోటుపాట్లు ఉండటాన్ని కలెక్టర్ గుర్తించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయకపోవడం, రిజిస్టర్ అందుబాటులో లేకపోవడం వంటి లోపాలను గుర్తించిన కలెక్టర్ కేంద్రం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వహణ తీరు ఇలాగే ఉంటే కమీషన్ నిలిపివేస్తామని, వచ్చే సీజన్ నుంచి సెంటర్‌ను కేటాయించబోమని కలెక్టర్ హెచ్చరించారు. రైతుల ప్రయోజనాలతో ముడిపడిన అంశాల్లో విధుల పట్ల నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో ధాన్యం సేకరణ జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లై డీఎం ప్రవీణ్, డీసీఓ శ్రీనివాస్, స్థానిక అధికారులు ఉన్నారు.

## బాల్య వివాహాలతో నష్టం

- **అదనపు కలెక్టర్ నగేష్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ**

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

బాల్య వివాహాల రహిత జిల్లాగా మెదక్ జిల్లాను తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ నగేష్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా మెదక్ పట్టణం రాందాస్ చౌరస్తాలో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్యవివాహం బతుకు ఆగం అనే నినాదంతో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ అదనపు





కలెక్టర్ నగేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాల్య వివాహాన్ని ఆపి ఆరోగ్యకరమైన, విద్యావంతమైన సురక్షిత సమాజాన్ని నిర్మించాలని అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు, అనేక చట్టాలు, హక్కులు తీసుకువచ్చిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం బాల్యవివాహాలను చేయమని ప్రతిజ్ఞ చేశారు. బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరికి సంపూర్ణ అవగాహన కల్పించాలని బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిఆర్డీఓ శ్రీనివాస్ రావు, జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, డీఎఫ్ఓ జోజి, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, డీఈఓ విజయ, కౌన్సిలర్ శివ రామకృష్ణ, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 29.04.2026
www.mudranews.in | @mudranews



**గౌతమ బుద్ధుడి సూచనలు:**

ఉన్నదానితో సంతృప్తి చెందండి. శాశ్వతం ఏదీ లేదని అర్థం చేసుకుంటే మనసుకు ప్రశాంతత లభిస్తుంది.



# పెట్రోల్, డీజిల్ ధరల పెంపు లేదు

**–ఎన్నికల తర్వాత ఇంధన ధరల పెంపు లేదని కేంద్రం స్పష్టం**

**– పశ్చిమాసియా ఉద్రిక్తతల మధ్య కూడా నిల్వలు ఉన్నాయని భరోసా**

**– పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ రేట్లు పెంచే యోచన లేదని అధికారుల వెల్లడి**

**–అపోహలకు లొంగవద్దని ప్రజలకు కేంద్రం సూచన**

**– అంతర్జాతీయ ఒత్తిళ్ల మధ్య కూడా వినియోగదారులపై భారం పడనివ్వమని హామీ**




**ముద్ర డెస్క్:**
దేశవ్యాప్తంగా సామాన్యుడిని కలవరపెడుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపు వార్తలకు కేంద్ర ప్రభుత్వం తెరదించింది. రాబోయే రోజుల్లో ఇంధన ధరలు భారీగా పెరుగుతాయంటూ సోషల్ మీడియాలో, వివిధ వర్గాల్లో జరుగుతున్న ప్రచారాన్ని కేంద్రం తీవ్రంగా ఖండించింది. ముఖ్యంగా కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత చమురు కంపెనీలు ధరలను సవరించే అవకాశం ఉందన్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు కీలక వివరణ ఇచ్చారు. న్యూఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో పెట్రోలియం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ సుజాత శర్మ మాట్లాడుతూ వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రస్తుతం ధరలను పెంచే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో లేదని భరోసా ఇచ్చారు.

**అంతర్జాతీయ ఉద్రిక్తతలు - భారత్‌పై ప్రభావం**

ప్రస్తుతం పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ (ముడి చమురు) ధరలు ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. ఈ పరిస్థితులు సహజంగానే సరఫరా గొలుసుపై ప్రభావం చూపుతాయని ఆమె అంగీకరించారు. అయితే భారత్ ముందుచూపుతో వ్యవహరించి తగినంత ఇంధన నిల్వలను సమకూర్చుకుందని వివరించారు. దేశీయ అవసరాలకు సరిపడా పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ నిల్వలు భారత్‌లో అందుబాటులో ఉన్నాయి. అంతర్జాతీయంగా సరఫరా ఇబ్బందులు ఎదురైనా దేశంలో ఇంధన కొరత ఏర్పడకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటోంది. అంతర్జాతీయ మార్కెట్లో ధరల ఒత్తిడి ఉన్నప్పటికీ ఆ భారం సామాన్యుడిపై పడకుండా కేంద్రం తన వంతు కృషి చేస్తోంది.

**అపోహలు నమ్మొద్దు..**

కొన్ని రోజులుగా సోషల్ మీడియా వేదికగా "ఎన్నికలు ముగియగానే పెట్రోల్ బాదుడు" అనే శీర్షికలతో వార్తలు వైరల్ అవుతున్నాయి. దీనివల్ల ప్రజలు బంకుల వద్ద క్యూ కట్టడం లేదా భయాందోళనకు గురికావడం జరుగుతోంది. దీనిపై స్పందించిన కేంద్రం, ఇలాంటి నిరాధారమైన వార్తలను నమ్మవద్దని కోరింది. "ప్రభుత్వం వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటానికే ప్రాధాన్యం ఇస్తుంది. అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పుడు కూడా తాము సమతుల్యతను పాటిస్తున్నాము. ప్రజలు అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలి" అని సుజాత శర్మ పేర్కొన్నారు.

**ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడకుండా జాగ్రత్తలు..**

పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే అది రవాణా రంగంపై ప్రభావం చూపి, తద్వారా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. ఈ ద్రవ్యోల్బణ పరిస్థితులను నివారించడానికి ప్రభుత్వం చమురు కంపెనీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది. ఇంధన సరఫరా వ్యవస్థ ప్రస్తుతం చాలా బలంగా ఉందని.. ఎలాంటి సంక్షోభ పరిస్థితులు తలెత్తే అవకాశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

కేంద్ర ప్రభుత్వ తాజా ప్రకటనతో గత కొన్ని రోజులుగా ప్రజల్లో ఉన్న సందిగ్ధత తొలగిపోయింది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, దేశీయంగా ధరల స్థిరత్వం కొనసాగుతుందనే వార్త సామాన్యులకు వాహనదారులకు పెద్ద ఊరటనిచ్చింది. చమురు నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో, కృత్రిమ కొరత సృష్టించే వారికి కూడా ఇది గట్టి హెచ్చరికగా మారింది.

## ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో భరోసా నింపిన ప్రజా ప్రభుత్వం



**ముద్ర, కూకట్‌పల్లి:** కేపీహెచ్‌బీ టెంపుల్ బస్‌స్టాప్ వద్ద మంగళవారం ఆర్టీసీ కార్మికులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొన్న అభద్రత తొలగిపోయిందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు పెండింగ్ సమస్యలను పరిష్కరించి కార్మికుల జీవితాల్లో భరోసా నింపిందన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహిళా నేతలు, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

## కేంద్రం నుంచి సహకారం అందించాలి



**ముద్ర, హైదరాబాద్ :** కేంద్రం నుంచి తెలం గాణకు సహకారం అందించాలని రాష్ట్ర పశుసం వర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువ జన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. రాజేంద్ర నగర్ లోని ఎన్‌ఎఫ్‌డీబీ కార్యాలయంలో కేంద్ర పశుసంవర్ధక పాడి పారిశ్రామికాభివృద్ధి మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ తో రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారి శ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, మత్స్య శాఖ డైరెక్టర్ నిఖిల, పశు సంవర్ధక శాఖ అధికారి లక్ష్మీ నారాయణ ప్రత్యేక భేటీ అయ్యారు. కేంద్రమంత్రికి శాలువా, పూల బోకే, మెమోటెంతో ఘనంగా సన్మానించారు. పశు సంవర్ధక, పాడి, మత్స్య శాఖల్లో తెలంగాణ అమలు చేస్తున్న పథకాలను కేంద్రమంత్రికి మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు.

## నిజాంపేట్‌లో వ్యాపారి అదృశ్యం

**ముద్ర, కూకట్‌పల్లి :**



స్థానిక నిజాం పేట్ రోడ్డులో ఫుట్‌వేర్ షాపు నిర్వహిస్తున్న బండారుపల్లి శ్రీనివాసరావు (62) అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిజాంపేట్ విల్లాస్ రోడ్డులోని అపార్ట్‌మెంట్‌లో నివసించే శ్రీనివాసరావు, మంగళవారం ఉదయం ఎప్పటిలాగే కెపిహెచ్బి కాలనీలోని తన షాపునకు వెళ్లారు. ఉదయం 11 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తానని సిబ్బందికి చెప్పి వెళ్లిన ఆయన, తిరిగి రాలేదు. మధ్యాహ్నం 2:40 గంటల సమయంలో కుటుంబ సభ్యులు షాపుకు ఫోన్ చేయగా, ఆయన తన సెల్‌ఫోన్‌ను షాపులోనే వదిలి వెళ్లినట్లు తెలిసింది. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య భారతి పోలీసులను ఆశ్రయించారు. కొంతకాలంగా ఉన్న ఆర్థిక ఇబ్బందుల వల్ల మనస్తాపానికి గురై ఆయన ఎక్కడికైనా వెళ్లి ఉండవచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసును హెడ్ కానిస్టేబుల్ నారాయణ విచారిస్తున్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే పోలీసులను సంప్రదించాలని కోరారు.

# ఉక్రెయిన్ లో మనుషులు మాయం..

**-అన్ని వేళ్లూ రష్యా వైపే..**

**-ఇంతకీ ఏం జరుగుతోంది..**



**ముద్ర డెస్క్:**
యుద్ధం వల్ల వచ్చే ప్రగతి ఉండదు. యుద్ధంతో కేవలం వినాశనం మాత్రమే జరుగుతుంది. ఈ ప్రపంచంలో ఇప్పటివరకు రెండు యుద్ధాలు భీకరంగా సాగాయి. అన్ని సందర్భాల్లో కూడా నష్టం విపరీతంగా జరిగింది.. ఆస్తిపరంగా, మనుషుల ప్రాణాలపరంగా పూడ్చలేని నష్టం చోటుచేసుకుంది. ప్రపంచ యుద్ధంలో భాగంగా అమెరికా.. జపాన్ మీద బాంబు వేసినప్పుడు.. విపరీతమైన నష్టం చోటుచేసుకుంది. ఇప్పటికీ అక్కడ పచ్చ గడ్డి కూడా మొలవడం లేదంటే.. పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఆధునిక కాలంలోనూ యుద్ధాలు జరుగుతున్నాయి. అత్యంత శక్తివంతమైన మిస్సయిల్స్.. ఇతర మందు గుండు సామగ్రితో యుద్ధాలు సాగిస్తున్నారు. ఈ యుద్ధాల్లో ప్రాణ నష్టం తీవ్రంగా ఉంటున్నది. అదే సమయంలో ఆస్తి నష్టం కూడా విపరీతంగా ఉంటున్నది. అందువల్లే యుద్ధాలు ఆపాలని.. ప్రపంచ శాంతిని వర్ధిల్లేలా చేయాలని డిమాండ్లు వ్యక్తం అవుతున్నాయి. అయినప్పటికీ యుద్ధ పిపాస ఉన్న అధ్యక్షులు ఏమాత్రం తగ్గడం లేదు. పైగా యుద్ధాలకు మరింత దారుణంగా పిలుపునిస్తున్నారు. అటువంటి అధ్యక్షుల వల్ల ప్రపంచంలో ఏదో ఒక చోట యుద్ధాలు సాగుతూనే ఉన్నాయి. అభివృద్ధి చెందిన దేశాల అధ్యక్షుల పిలుపుల వల్ల ఈ దారుణాలు జరుగుతున్నాయి.

యుద్ధాలకు పిలుపునిచ్చే దేశ అధ్యక్షులు బాగానే ఉంటున్నారు. కానీ ముందు వరసలో పనిచేసే సైనికులే నరకం చూస్తున్నారు. చివరికి వారే సమిధలుగా మారిపోతున్నారు. యుద్ధాల వల్ల సైనికుల పరిస్థితి దారుణంగా ఉంటుందో ప్రపంచానికి ఇప్పటికే అనేక సందర్భాలలో అర్థమైంది. తాజాగా మరో దారుణం వెలుగులోకి వచ్చింది.

రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య కొంత కాలంగా యుద్ధం సాగుతోంది. ఉక్రెయిన్ దేశంలో పోరాడుతున్న రష్యా సైనికులు ఆకలితో అలమటిస్తున్నారు. ఆకలి తట్టుకోలేక నర మాంస భక్షణకు కూడా దిగినట్టు తెలుస్తోంది. దీ సండే టైమ్స్ అనే పత్రిక ఈ కథనాన్ని వెల్లడించింది. దాదాపు ఐదు సందర్భాల్లో రష్యా సైనికులు తమ తోటి వారి మాంసాన్ని తిన్నారని ఉక్రెయిన్ నిఘా వర్గాల సమాచారంతో తెలిసింది.

2025లో నవంబర్ నెలలో డోనెట్స్ ప్రాంతంలో ఒక సైనికుడు మరో ఇద్దరు సైనికులను చంపాడు. ఆ సైనికులను అతడు తినడానికి ప్రయత్నిస్తుండగా ఉక్రెయిన్ దళాలు చంపేశాయి.. ఈ కథనాన్ని ది సండే టైమ్స్ వెల్లడించింది. దీంతో యుద్ధం వల్ల జరిగే పరిణామాలు ఎంత తీవ్రంగా ఉంటాయో.. అవి ఎంతటి దారుణానికి దారి తీస్తాయో ప్రపంచానికి తెలిసింది. దీంతో యుద్ధాల వల్ల కలిగే అనర్థాలు తెలుస్తాయి.

## మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ను కలిసిన మాజీ గవర్నర్




**ముద్ర, హైదరాబాద్:** మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ భారత దేశ మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ను ఈ మంగళవారం హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇద్దరు ప్రముఖులు దేశానికి సంబంధించిన పలు ముఖ్య అంశాలపై సౌహార్దపూర్వకంగా చర్చలు జరిపారు. అలాగే తమ మధ్య ఉన్న దీర్ఘకాలిక అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. రామ్ నాథ్ కోవింద్ “ఒక దేశం – ఒకే ఎన్నిక” అనే అంశంపై తన అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ నివేదికను భారత రాష్ట్రపతికి సమర్పించినట్లు తెలిపారు. ఆ నివేదికను పార్లమెంట్‌కు పంపించగా, ప్రస్తుతం ఆ అంశాన్ని పరిశీలించేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయబడిందన్నారు. అలాగే రామ్ నాథ్ కోవింద్, బండారు దత్తాత్రేయ ఆరోగ్యం, రోజువారీ కార్యక్రమాల గురించి ఆరా తీశారు.

## రోడ్డు ప్రమాదంలో ఫార్మసీ సేల్స్‌మెన్ మృతి




**ముద్ర, కూకట్‌పల్లి:** నగరంలోని కేపీహెచ్‌బీ కాలనీ నిజాంపేట్ ఎక్స్ రోడ్ వద్ద మంగళవారం అతివేగంగా వచ్చిన వాటర్ ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో అభినవ్ కుమార్ మిశ్రా (25) అనే యువకుడు అక్కడికక్కడే మరణించాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. బీహార్‌కు చెందిన అభినవ్ కుమార్ మిశ్రా 15 ఏళ్లుగా బోరబండలోని తన మేనమామ బిజేందర్ మణి త్రిపాఠి వద్ద ఉంటూ ఒక ఫార్మసీ కంపెనీలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే డ్యూటీ నిమిత్తం తన బైక్ పై మియాపూర్ నుండి కేపీహెచ్‌బీ వైపు వెళ్తుండగా నిజాంపేట్ చౌరస్తా వద్ద వెనుక నుంచి వచ్చిన వాటర్ ట్యాంకర్ బలంగా ఢీకొట్టడంతో యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని మేనమామ ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

# మహిళా సర్పంచ్ ల ఫోరం కన్వీనర్‌గా రేణుక

**ముద్ర, హైదరాబాద్:**
రాష్ట్ర మహిళా సర్పంచ్ ల ఫోరం కన్వీనర్ గా గుంటిపల్లి రేణుక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ లోని సెక్రటేరియట్ ఆవరణలో జరిగిన మహిళా సర్పంచ్ ల సమావేశంలో మహిళా సర్పంచ్ లందరూ కలిసి రేణుకను కన్వీనర్ గా ఎన్నుకున్నారు. ఎంబీసీ, సంచార జాతుల సామాజిక నేపథ్యం గల గుంటిపల్లి రేణుక ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామం నుంచి భారీ మేజార్టీతో ఎన్నికయ్యారు. ఈ సారి తెలంగాణ పంచాయతీల్లో దాదాపు 50 శాతం సర్పంచ్ స్థానాలు మహిళలకే దక్కాయి. రాష్ట్రంలో మొత్తం 12,703 గ్రామాల్లో 6,403 మంది మహిళా సర్పంచ్ లే ఉన్నారు. గ్రామ పంచాయతీల్లోని సమస్యలు, ముఖ్యంగా గ్రామాల్లోని మహిళలపై, మహిళా సర్పంచ్ ల ప్రాధాన్యాలపై మహిళా సర్పంచ్ ల ఫోరం పనిచేస్తుంది. మండల, జిల్లా కమిటీల ఎన్నిక అనంతరం హైదరాబాద్ లో రాష్ట్ర మహిళా సర్పంచ్ ల ఫోరం పూర్తి స్థాయి కమిటీ ఎన్నిక ఉంటుంది. ఈ లోగా మహిళా సర్పంచ్ ల ఫోరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి సమస్యలపై అధ్యయనం చేస్తుంది. పూర్తి స్థాయి రాష్ట్ర కమిటీ ప్రకటన వరకు రేణుక కన్వీనర్ గా వ్యవహరిస్తారు.



రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి మహిళా సర్పంచ్ లను ఏకం చేసి జిల్లా కమిటీలను, రాష్ట్ర కమిటీని అధికారికంగా నియమిస్తామని, ఇదే క్రమంలో సమస్యలపై చర్చించి పోరాటం చేస్తామని ఈ సందర్భంగా గుంటిపల్లి రేణుక చెప్పారు. గ్రామ పంచాయతీలు ఆర్థిక పరిపుష్టిని సాధించేందుకు నేరుగా నిధులు విడుదల చేయాలని, గ్రామాల్లో మహిళా సర్పంచ్ ల సాధికారిత కోసం ప్రభుత్వం చొరవ తీసుకునే విధంగా, మహిళా సర్పంచ్ ల వేతనం పెంచే విధంగా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామని తెలిపారు. నిత్యం గ్రామాల్లోనే ప్రజల మధ్య ఉంటూ ఇంటివలే ఊరి ని చక్కదిద్దే బాద్యతలను కలిగిన మహిళా సర్పంచ్ ల సమస్యలపై మరింత అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. దేశాభివృద్ధి చెందాలంటే అది గ్రామ స్థాయి నుంచి శ్రీకారం జరగాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే గ్రామాలు అభివృద్ధి చెందాలన్నారు. ప్రజాస్వామ్యం మనుగడ సాధించాలంటే గ్రామాలు పరిపుష్టిగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్ ల అభ్యున్నతి కోసం తాను తీవ్రంగా కృషి చేస్తానని రేణుక తెలిపారు.

## యువకుడిపై బీరు సీసాతో దాడి

**ముద్ర, కూకట్‌పల్లి:** రాజకీయ విభేదాలు, కుల ప్రస్తావన ఒక యువకుడిపై దాడికి దారితీసిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన కాటం గణేష్ యాదవ్ (26) కేపీహెచ్‌బీ 6వ ఫేజ్‌లోని ఒక హాస్టల్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 27న గణేష్ తన పరిచయస్తులైన గోవింద్ మలబంతి, బాజీలను కలవడానికి కేపీహెచ్‌బీ రోడ్ నంబర్ 2లోని వారి గదికి వెళ్ళాడు. అక్కడ ఐదుగురు కలిసి మద్యం సేవించారు. మంగళవారం తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో వారి మధ్య రాజకీయ పార్టీల విషయంలో తీవ్ర చర్చ కాస్తా వాగ్వాదానికి దారితీసింది. ఆగ్రహానికి లోనైన గోవింద్, పక్కనే ఉన్న బీరు సీసాతో గణేష్ తలపై బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. మరో నిందితుడు బాజీ అతనికి సహకరించాడు. బాధితుడు తన స్నేహితుడు మోహన్ నాయుడుకు సమాచారం అందించగా, అతను ఘట నా స్థలానికి చేరుకుని గణేష్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ ఎస్ఐ కె. లింగం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గౌతమ బుద్ధుడి సూచనలు
అహంకారాన్ని తగ్గించండి. వినయం పెరిగితే సంబంధాలు, నిర్ణయాలు మెరుగవుతాయి.

తెలంగాణలో కార్యకలాపాలు విస్తరిస్తున్న

## ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్

- మియాపూర్‌లో కొత్త శాఖ ప్రారంభం



హైదరాబాద్, ఏప్రిల్ 28 (న్యూస్): ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తెలంగాణలో తన కార్యకలాపాలను మరింత విస్తరించింది. ఆదిత్య బిర్లా క్యాపిటల్ లిమిటెడ్ అనుబంధ సంస్థగా ఉన్న ఈ ప్రముఖ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ, హైదరాబాద్ నగరంలోని మియాపూర్ లో కొత్త శాఖను ప్రారంభించింది. ఈ విస్తరణతో తెలంగాణలో సంస్థ శాఖల సంఖ్య 9కు చేరుకుంది.

దేశవ్యాప్త పంపిణీ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో పట్టు సాధించడం, వినియోగదారులకు సేవలను మరింత చేరువ చేయడం ఈ నిర్ణయానికి ప్రధాన కారణాలని సంస్థ తెలిపింది. మియాపూర్ ప్రాంతం ఇటీవల కాలంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నివాస ప్రాంతంగా మారింది. మెరుగైన మౌలిక సదుపాయాలు, మెట్రో కనెక్టివిటీతో వేతన జీవులు, తొలిసారి ఇల్లు కొనుగోలు చేసే వర్గాల్లో ఇక్కడ గృహాల డిమాండ్ పెరుగుతోంది. స్థానిక అవసరాలకు అనుగుణంగా గృహ రుణ సదుపాయాలను అందించడం ద్వారా ఈ డిమాండ్‌ను తీర్చడమే కొత్త శాఖ లక్ష్యంగా ఉంది. ఏబీహెచ్‌ఎఫ్‌ఎల్ వివిధ వర్గాల వినియోగదారులకు అఫోర్డబుల్ హౌసింగ్, ప్రైమ్ హౌసింగ్, కన్‌స్ట్రక్షన్ ఫైనాన్స్, ఆస్తిపై రుణాలు వంటి విభిన్న సేవలను అందిస్తోంది. వేతన జీవులు, స్వయం ఉపాధి నిపుణులు, చిన్న వ్యాపారులు, వర్ధమాన ఆదాయ వర్గాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంస్థ సేవలను విస్తరించింది. ఆధునిక డిజిటల్ వ్యవస్థలతో లోన్ ఆమోద ప్రక్రియను వేగవంతం చేసి, పారదర్శకమైన సేవలను అందిస్తున్నట్లు సంస్థ పేర్కొంది. కొత్త శాఖ ప్రారంభాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఆఫర్లను కూడా ప్రకటించింది. 2026 ఏప్రిల్ 27 నుంచి మే 31 వరకు జీరో లాగిన్ ఫీజుతో రూ. 50 లక్షల వరకు తక్షణ రుణ మంజూరు సదుపాయాన్ని అందిస్తోంది. దీని ద్వారా వినియోగదారులు తక్కువ ఖర్చుతో వేగంగా రుణాలు పొందే అవకాశం కలుగుతుంది.

ఈ సందర్భంగా సంస్థ ఎండీ & సీఈఓ పంకజ్ గాడ్గిల్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్థకు కీలకమైన మార్కెట్ అని, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ప్రాంతీయ కార్యకలాపాలను విస్తరిస్తున్నామని తెలిపారు. విస్తృత నెట్‌వర్క్, డిజిటల్ సామర్థ్యాలతో వినియోగదారుల సొంతింటి కలను సులభంగా, వేగంగా నెరవేర్చడమే లక్ష్యమని చెప్పారు. 'హ్యాపీ హోమ్ లోన్ జర్నీ' నినాదంతో వినియోగదారులకు ప్రాధాన్యతనిస్తూ, బాధ్యతాయుత రుణ విధానాల ద్వారా ఆర్థిక సమ్మిళితత్వాన్ని పెంపొందించడంపై సంస్థ దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఏఐ డేటా హబ్‌గా విశాఖపట్నం

- మంత్రి నారా లోకేష్
- గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన




విశాఖపట్నం, ఏప్రిల్ 28 (న్యూస్): విశాఖపట్నం నగరం ఇకపై గ్లోబల్ ఐటీ మ్యాప్‌లో ప్రత్యేక స్థానం సంపాదించబోతుందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. విశాఖ సమీపంలోని తర్లువాడ వద్ద గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి పాల్గొన్న మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ, ఇప్పటి వరకు స్టీల్ సిటీగా పేరుగాంచిన విశాఖపట్నం, ఇకపై ఏఐ డేటా హబ్‌గా గుర్తింపు పొందుతుందని పేర్కొన్నారు. గూగుల్ ఏఐ ప్రాజెక్ట్ నగర అభివృద్ధికి కీలక మలుపు తిప్పనుందని, ఇది కేవలం ఒక ప్రాజెక్ట్ మాత్రమే కాకుండా భవిష్యత్తు తరాలకు పునాది వేస్తుందని అన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో పరిశ్రమలు వెనుకబడిన పరిస్థితి నెలకొన్నప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెట్టుబడులను ఆకర్షించడంపై దృష్టి పెట్టిందని తెలిపారు. దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షించే దిశగా వేగవంతమైన చర్యలు చేపట్టినట్లు వివరించారు. గూగుల్ సంస్థ విశాఖపట్నంలో సుమారు రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో ఏఐ మెగా డేటా సెంటర్ ఏర్పాటు చేయనుందని తెలిపారు. 1 గిగావాట్ సామర్థ్యంతో నిర్మాణం జరగనున్న ఈ ప్రాజెక్ట్ 2028 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. నిర్మాణ దశలో సుమారు 25 వేల మందికి, పూర్తయ్యాక ప్రత్యక్ష, పరోక్షంగా కలిపి దాదాపు 2 లక్షల ఉద్యోగాలు కల్పించనున్నట్లు వెల్లడించారు.



ఈ ప్రాజెక్ట్ ద్వారా విశాఖపట్నం ప్రాంతం ట్రిలియన్ డాలర్ ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశముందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఐటీ, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి రంగాల్లో విస్తృత అవకాశాలు ఏర్పడనున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ప్రాజెక్ట్ వేగంగా ముందుకు సాగిందని, ముఖ్యమంత్రి నేరుగా పర్యవేక్షణ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. గూగుల్ ప్రతినిధులతో 2024లో ప్రారంభమైన చర్చలు తక్కువ సమయంలోనే ఫలితాన్నిచ్చాయని తెలిపారు.

### గూగుల్ కి ధన్యవాదాలు

భారత్, ఆంధ్రప్రదేశ్ పై నమ్మకంతో వచ్చిన గూగుల్ సంస్థకు మంత్రి లోకేష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఎనేబుల్ చేయడంలో కీలకపాత్ర వహించిన అదానీ గ్రూప్‌కి, భారతీ ఎయిర్‌టెల్‌కి అభినందనలు తెలిపారు. అలాగే విశాఖపట్నం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణ ప్రభుత్వ లక్ష్యమని, విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ప్రాంతాలను వేర్వేరు ఆర్థిక మండలాలుగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఉద్యోగాల సృష్టి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర రైల్వే, సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఇతర కేంద్ర మంత్రులు భూపతిరాజు శ్రీనివాస వర్మ, కే.రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్, గూగుల్ క్లౌడ్, గూగుల్ గ్లోబల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ వైస్ ప్రెసిడెంట్ బికాష్ కోలే, భారతి ఎంటర్ ప్రైజెస్ వైస్ ఛైర్మన్ రాకేష్ మిట్టల్, అదానీ గ్రూప్ ఛైర్మన్ జీత్ అదానీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, యూఎస్ కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్, గూగుల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్, కంట్రీ మేనేజర్ ప్రీతి లొబానా, అదానీ గ్రూప్ డైరెక్టర్ కరణ్ అదానీ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



### సీఎం ప్రజావాణిలో 325 దరఖాస్తులు

ముద్ర, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన 217వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో 325 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 92, రెవెన్యూ శాఖకు సంబంధించి 40, ఇందిరమ్మ ఇండ్ల కోసం 106 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 87 దరఖాస్తులు అందాయి.

సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, ఏ.సీ.పీ. ఉమేందర్, ఎన్.ఆర్.ఐ. సలహా మండలి వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, ప్రవాసి ప్రజావాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కొత్త డీజీపీ 'సీవీ ఆనంద్'

- తెలంగాణ పోలీస్ విభాగానికి చీఫ్‌గా బాధ్యతలు
- యూపీఎస్సీ సిఫార్సులతో నియామకం
- ట్రాఫిక్ నుంచి సైబర్ వరకు సంస్కరణలతో గుర్తింపు పొందిన అధికారి



ముద్ర డెస్క్: తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగానికి కొత్త డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా సీవీ ఆనంద్ నియమితులయ్యారు. యూపీఎస్సీ సిఫార్సుల మేరకు ఆయనను ఈ పదవికి నియమించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆనంద్, ఏప్రిల్ 30న పదవీ విరమణ చేయనున్న ప్రస్తుత డీజీపీ బి. శివధర్ రెడ్డి స్థానాన్ని భర్తీ చేయనున్నారు.

1991 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అయిన సీవీ ఆనంద్, సైబరాబాద్, హైదరాబాద్, విజయవాడ నగరాల్లో పోలీస్ కమిషనర్‌గా పనిచేసి విశేష అనుభవాన్ని సొంతం చేసుకున్నారు. అనేక సంచలన కేసులను ఛేదించి, సమర్థ అధికారిగా గుర్తింపు పొందారు. 1968 జూన్ 5న రంగారెడ్డి జిల్లాలో జన్మించిన సీవీ ఆనంద్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసి, నిజాం కాలేజీ నుంచి డిగ్రీ, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎకనామిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించిన ఆయన, యువకుడిగా భారత అండర్-19 క్రికెట్ జట్టులో ఎంపికయ్యారు. అనంతరం ఐపీఎస్‌లో ప్రవేశించి ప్రజాసేవ వైపు మళ్లారు. వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో అదనపు ఎస్పీ, ఎస్పీగా పని చేసిన సమయంలో నక్సలైట్ ప్రభావిత ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించారు. మావోయిస్టులను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంలో కూడా ఆయన చొరవ చూపారు. హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు కమిషనర్‌గా పనిచేసిన సమయంలో ఈ-చలాన్ వ్యవస్థను ప్రవేశపెట్టి ట్రాఫిక్ నిర్వహణలో మార్పులు తీసుకొచ్చారు. హుస్సేన్ సాగర్ వద్ద ఆత్మహత్యలను అరికట్టేందుకు లేక్ పోలీస్ వ్యవస్థ ఏర్పాటు చేయడం ఆయన ఆలోచన ఫలితం. సైబరాబాద్ కమిషనర్‌గా ఉన్న సమయంలో మహిళల భద్రత కోసం 'షీ టీమ్స్'ను బలోపేతం చేయడం, ఐటీ కారిడార్‌లో భద్రతా చర్యలను పెంచడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ట్రాఫిక్ నియంత్రణలో గూగుల్ మ్యాప్స్, డ్రోన్ల వినియోగాన్ని ప్రోత్సహించారు. సీసీటీవీ, ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా నేర పరిశోధనలో ఆధునిక పద్ధతులను అమలు చేశారు.

మత్తు పదార్థాల నియంత్రణలో ఆయన నాయకత్వంలోని హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ చేసిన కృషికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. దుబాయ్‌లో నిర్వహించిన వరల్డ్ పోలీస్ సమ్మిట్-2025లో ప్రతిష్ఠాత్మక ఎక్సలెన్స్ అవార్డును అందుకుంది.

### వ్యక్తిగత జీవనశైలి

సీవీ ఆనంద్ విధుల్లో కఠినంగా ఉండటమే కాకుండా ఆరోగ్యం విషయంలోనూ క్రమశిక్షణ పాటిస్తారు. శాకాహారానికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రతిరోజూ క్రీడల ద్వారా ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటున్నారు.

విస్తృత అనుభవం, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, పరిపాలనా నైపుణ్యాలతో తెలంగాణ పోలీస్ విభాగాన్ని మరింత బలోపేతం చేయనున్నారని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# పర్యాటక 'ప్రభ' పెంచుదాం..

- తెలంగాణను మేటి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి
- జూపల్లి కృష్ణారావు



హైదరాబాద్, ఏప్రిల్ 28 (న్యూస్): తెలంగాణను దేశంలో అగ్రగామి పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేయడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులకు సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బేగంపేట టూరిజం ప్లాజాలో నిర్వహించిన పర్యాటక సలహా కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని వారసత్వ సంపద, సంస్కృతి, చారిత్రక కట్టడాలు, ప్రకృతి సౌందర్యం, జల వనరులు, అరణ్య ప్రాంతాలు, ఆధ్యాత్మిక కేంద్రాలను సమన్వయం చేస్తూ తెలంగాణను శక్తివంతమైన పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పర్యాటక ప్రాంతాల్లో కనీస సౌకర్యాల విషయంలో రాజీ పడకూడదని, ముఖ్యంగా మరుగుదొడ్లు, తాత్కాలిక వసతి గదులు, టెంట్లు, గ్లాస్ హౌస్‌లు, రహదారి పక్కన విశ్రాంతి సదుపాయాలను తక్షణమే మెరుగుపరచాలని ఆదేశించారు. పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధికి నిర్దిష్ట కాలపరిమితి విధించి, ప్రతి ప్రాజెక్టుకు నోడల్ అధికారిని నియమించి అమలు వేగవంతం చేయాలని సూచించారు. దేశీయ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు నవంబర్ లేదా డిసెంబర్‌లో హైదరాబాద్‌లో భారీ స్థాయిలో కార్నివాల్ నిర్వహణపై అధ్యయనం చేసి ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రారంభంలో ప్రభుత్వం నిర్వహించి, భవిష్యత్తులో ప్రైవేట్ భాగస్వామ్యంతో స్వయం సమృద్ధిగా కొనసాగించేలా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు.

నగర సుందరీకరణలో భాగంగా జీహెచ్ ఎంసీ, హెచ్ ఎండీఏ సమన్వయంతో శిల్పాలు, ల్యాండ్‌స్కేపింగ్, స్కేవాక్‌లను అభివృద్ధి చేయాలని సూచించారు. రాష్ట్రంలోని వరంగల్ రామప్ప దేవాలయం, యాదాద్రి, గోల్కొండ కోట, నాగార్జునసాగర్ వంటి కీలక పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రధాన పర్యాటక కేంద్రాల్లో వారాంతాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి పర్యాటకులను ఆకర్షించాలని సూచించారు.


స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణి ప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సమృద్ధిగా ఉన్న పర్యాటక వనరులు ఉన్నప్పటికీ ప్రచారంలో వెనుకబడి ఉన్నామని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. హరిత హోటళ్ల నిర్మాణం, కెరావాన్ విధానం, వారసత్వ కట్టడాల పరిరక్షణకు ట్రస్ట్ మోడల్ అమలు చేయాలని సూచించారు.

కమిటీ సభ్యులు తెలంగాణను అంతర్జాతీయ స్థాయిలో వెడ్డింగ్ డెస్టినేషన్‌గా, అలాగే మెడికల్, వెల్నెస్, గోల్ఫ్, ఫిల్మ్, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. మధ్యప్రాచ్యం, సెంట్రల్ ఆసియా దేశాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు ఇన్వెస్టర్ అవుట్ రీచ్ కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రైవేట్ భాగస్వామ్యంతో స్టార్ హోటళ్ల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు.

ఈ సమావేశంలో పర్యాటక అభివృద్ధి సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ గౌతమి, డైరెక్టర్ ఆఫ్ టూరిజం - లక్ష్మణ్ రంజిత్ నాయక్, కమిటీ సభ్యులు పాపారావు (ఐఏఎస్), కమలవర్ధన్ రావు (ఐఏఎస్), డాక్టర్ బాలాజీ, జుల్ఫీ, మార్గ్ పటేల్, రాందేవ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రజ్యోతి విలేకరి దారుణ హత్య

- కత్తులతో పాశవికంగా నరికి హత్య
- మరో పాత్రికేయుడికి గాయాలు



ముద్ర, వి. కోట: చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గంలోని వి. కోట మండలం రహమత్‌నగర్‌లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రిపోర్టర్ వి. జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యకు గురయ్యారు. మంగళవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన సమయంలో ఇద్దరు దుండగులు కత్తులతో దాడిచేసి పాశవికంగా హతమార్చారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. జగన్మోహన్ రెడ్డి ప్రతిరోజులాగే ఉదయం నడకకు వెళ్లారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి పత్రిక రిపోర్టర్ వి.సుబ్రహ్మణ్యం కూడా ఆయనతో చేరి ఇద్దరూ కలిసి నడుస్తుండగా, ముందుగానే కాపు కాచి ఉన్న తమీం, సుభాన్ అనే దుండగులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆకస్మికంగా దాడికి దిగారు. జగన్మోహన్ రెడ్డిని వెంబడించి కత్తులతో దాడి చేయగా, ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. దాడి సమయంలో సుబ్రహ్మణ్యంను తోసివేయడంతో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

చిత్తూరు జిల్లా ఎస్పీ ప్రశాంత్ దూడి ఘటనాస్థలాన్ని పరిశీలించి, స్థానికులు, మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ప్రధాన నిందితుడు తమీం నేరచరిత్ర కలిగిన రౌడీషీటర్‌గా పోలీస్ రికార్డుల్లో ఉన్నాడని, ఇటీవలే రిమాండ్ నుంచి విడుదలైనట్లు తెలిపారు. హత్యకు గల కారణాలపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు, నిందితులను పట్టుకోవడానికి ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జగన్మోహన్ రెడ్డికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

### జర్నలిస్టు సంఘాల ఆగ్రహం

ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ), ఏపీయూడబ్ల్యుజే, టీయూడబ్ల్యుజే నేతలు వేర్వేరు ప్రకటనల్లో ఈ హత్యను ఖండించారు. దోషులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, మృతుడి కుటుంబానికి తగిన పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# టీ20 ప్రపంచకప్‌కు ఇంగ్లాండ్ జట్టు ప్రకటన

- కెప్టెన్‌గా నాట్ సైవర్-బ్రంట్!
- అనుభవం, యువ ప్రతిభ మేళవింపుతో పటిష్టమైన టీమ్..
- 18 ఏళ్ల స్పిన్నర్ టిల్లీకి చోటు
- జూన్ 12న శ్రీలంకతో తొలి పోరు..
- గ్రూప్-బిలో ఇంగ్లీష్ జట్టు ప్రయాణం



**లండన్:** మహిళల టీ20 ప్రపంచకప్ 2026 సమరానికి ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు సర్వసన్నద్ధమైంది. మెగా టోర్నీ కోసం అనుభవజ్ఞులైన క్రీడాకారిణులు మరియు వర్ధమాన ప్రతిభావంతులతో కూడిన అత్యంత పటిష్టమైన జట్టును సోమవారం ప్రకటించింది. ఈ ప్రతిష్టాత్మక జట్టుకు స్టార్ ఆల్‌రౌండర్ నాట్ సైవర్-బ్రంట్‌ను కెప్టెన్‌గా నియమిస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. డబ్ల్యూపీఎల్ (ఫ్రా)లో ముంబై ఇండియన్స్ తరఫున సత్తా చాటుతున్న ఆమె, ఇప్పటివరకు 137 అంతర్జాతీయ టీ20ల్లో 2,960 పరుగులు చేయడంతో పాటు 90 వికెట్లు తీసి తిరుగులేని ఆల్‌రౌండర్‌గా గుర్తింపు పొందింది. ఆమె నాయకత్వంలో ఇంగ్లాండ్ జట్టు ఇప్పటివరకు 16 మ్యాచ్‌ల్లో 11 విజయాలను నమోదు చేయడం విశేషం.



### జట్టులో యువ రక్తం - స్పిన్ విభాగంపై గురి

ఈసారి జట్టు ఎంపికలో ఈసీబీ అనూహ్య నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యంగా 18 ఏళ్ల యువ స్పిన్నర్ టిల్లీ కోర్టీన్-కోల్మన్‌కు జట్టులో చోటు కల్పించడం విశేషం. మహిళల 'హండ్రెడ్' టోర్నీలో 17 వికెట్లతో మెరిసిన ఆమె, ప్రపంచ నంబర్ వన్ స్పిన్నర్ సోఫీ ఎక్లెస్టోన్‌కు జోడీగా మైదానంలోకి దిగనుంది. బ్యాటింగ్ విభాగంలో డానీ వైట్-హాడ్జ్, హీథర్ నైట్ మరియు సోఫియా డంక్లీ వంటి సీనియర్లు బాధ్యత తీసుకోనుండగా, వికెట్ కీపర్ బ్యాటర్ ఏమీ జోన్స్ ఫినిషర్‌గా జట్టుకు బలం చేకూర్చనుంది. బౌలింగ్ విషయానికి వస్తే, ఆర్‌సీబీ స్టార్ లారెన్ బెల్ పేస్ విభాగానికి నాయకత్వం వహించనుంది. ఆమెకు తోడుగా ఫ్రేయా కెంప్, లారెన్ ఫైలర్, ఇస్సీ వాంగ్ వంటి వేగవంతమైన బౌలర్లు సిద్ధంగా ఉన్నారు.

### పోరు సాగనుందిలా..

టోర్నీలో గ్రూప్-బిలో ఉన్న ఇంగ్లాండ్ తన ప్రయాణాన్ని జూన్ 12న బర్మింగ్‌హామ్ వేదికగా శ్రీలంకతో జరిగే మ్యాచ్‌తో ప్రారంభించనుంది. అనంతరం జూన్ 16న ఐర్లాండ్‌తో, జూన్ 20న స్కాట్లాండ్‌తో తలపడనుంది. గ్రూప్ దశలో కీలకమైన మ్యాచ్‌లు జూన్ 24న వెస్టిండీస్‌తో (లార్డ్స్), జూన్ 27న న్యూజిలాండ్‌తో (ఓవల్) జరగనున్నాయి. అలిస్ క్యాప్సీ, చార్లీ డీన్ వంటి ఆల్‌రౌండర్లతో సమతూకంగా కనిపిస్తున్న ఇంగ్లాండ్ జట్టు, ఈసారి విశ్వవిజేతగా నిలవడమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. గత రికార్డులు, ప్రస్తుతం ఉన్న ఫామ్‌ను బట్టి చూస్తే ఇంగ్లాండ్ టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా నిలుస్తోందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.



## మెంటర్‌షిప్ సరిగా ఉంటే..

### వైభవ్‌పై మనూ భాకర్ కామెంట్స్.. నెట్టింట చర్చ

**న్యూఢిల్లీ:** యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ గురించి షూటర్ మనూ భాకర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీశాయి. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకుంటున్న వైభవ్ సూర్యవంశీ, భారీ షాట్లు కొడుతూ కీలక ఇన్నింగ్స్‌లు ఆడుతున్నాడు. ఇటీవల ముగిసిన టీ20 అండర్-19 వరల్డ్‌కప్‌లోనూ అతని ప్రతిభ మరోసారి వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కార్యక్రమంలో పాల్గొన్న మనూ భాకర్‌ను ఓ రిపోర్టర్, వైభవ్ సూర్యవంశీ గురించి అభిప్రాయం అడిగారు. దీనికి స్పందించిన మనూ భాకర్, సరైన మార్గదర్శకత్వం ఉంటే వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని, ప్రతిభకు వయసుతో ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. చిన్న వయసులోనైనా, పెద్ద వయసులోనైనా గొప్ప విజయాలు సాధ్యమేనని ఆమె పేర్కొన్నారు. వైభవ్ చుట్టూ ఉన్న వారు సరైన మార్గంలో నడిపిస్తే, అతను భవిష్యత్తులో గొప్ప స్టార్‌గా ఎదుగుతాడని ఆశాభావం వ్యక్తం చేశారు అయితే మనూ భాకర్ చేసిన ఈ వ్యాఖ్యలపై ఆన్‌లైన్‌లో మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కోల్‌కతా నైట్ రైడర్స్ మాజీ టీం డైరెక్టర్ జోయ్ భట్టాచార్య ఈ సందర్భంగా స్పందిస్తూ, ఒక ఒలింపిక్ పతక విజేతను క్రికెటర్ గురించి ప్రశ్నించడం సరైన విధానం కాదని విమర్శించారు. ఆమె సాధించిన విజయాలను చిన్నచూపు చూడటంలా ఇది అనిపిస్తుందని అన్నారు. మనూ భాకర్ గురించి వైభవ్ సూర్యవంశీని అడిగితే, అతను ఇచ్చే స్పందన ఎలా ఉంటుందో చూడాలని వ్యాఖ్యానించారు. కొందరు నెటిజన్లు కూడా ఈ ప్రశ్నను తప్పుపట్టారు. వేర్వేరు క్రీడలకు చెందిన క్రీడాకారులను ఇలా పోల్చడం లేదా ఒకరిపై మరొకరి అభిప్రాయం అడగడం అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఇక మనూ భాకర్ క్రీడా ప్రస్థానాన్ని పరిశీలిస్తే, ఆమె 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలను సాధించి చరిత్ర సృష్టించారు. 10 మీటర్ల పిస్టోల్ ఈవెంట్‌లో ఒకటి, 10 మీటర్ల పిస్టోల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మరోటి గెలుచుకుని, ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన భారత క్రీడాకారిణిగా అరుదైన ఘనతను అందుకున్నారు.



## ఐపీఎల్‌పై వార్నర్ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 :** ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం డేవిడ్ వార్నర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. గతంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి టైటిల్ అందించిన వార్నర్, ఇటీవల ఐపీఎల్‌పై చేసిన స్పందన సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రస్తుతం పాకిస్థాన్ సూపర్ లీగ్ 2026 సీజన్‌లో కరాచీ కింగ్స్ జట్టుకు నాయకత్వం వహించిన వార్నర్, జట్టు గ్రూప్ దశలోనే నిష్క్రమించడంతో భావోద్వేగపూరిత సందేశం పంచుకున్నాడు. జట్టు కృషిని ప్రశంసిస్తూ, అభిమానులు, నిర్వాహకులు, భద్రతా సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్రమంలో ఒక భారతీయ నెటిజన్ చేసిన కామెంట్‌కు వార్నర్ ఇచ్చిన సమాధానం సంచలనంగా మారింది. 'ఐపీఎల్‌కు తిరిగి రావాలి' అన్న సూచనపై "ఇప్పుడు ఆ అవసరం లేదు" అంటూ ఆయన కౌంటర్ ఇచ్చాడు. ఈ స్పందనపై పాకిస్థాన్ అభిమానులు వార్నర్‌ను సమర్థిస్తుండగా, భారత అభిమానులు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా వార్నర్ వ్యాఖ్యలు రెండు దేశాల క్రికెట్ అభిమానుల మధ్య చర్చలకు దారితీయగా, సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి.

## వింత నిర్ణయాలు.. జట్లకు నష్టం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ ఉత్కంఠభరితంగా కొనసాగుతున్నప్పటికీ, కొన్ని జట్ల సారథులు తీసుకుంటున్న వింత నిర్ణయాలు తీవ్ర విమర్శలకు దారి తీస్తున్నాయి. అనవసర ప్రయోగాలు, కీలక సమయంలో తప్పు వ్యూహాలు అమలు చేయడం వల్ల గెలిచే మ్యాచ్‌లను సైతం చేజార్చుకుంటున్నారు. ముఖ్యంగా ఢిల్లీ, రాజస్థాన్, లక్నో జట్ల పరాజయాలకు సారథుల నిర్ణయాలే కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీ జట్టు విషయంలో తీసుకున్న నిర్ణయాలు ఆశ్చర్యానికి గురిచేశాయి. బలమైన బౌలింగ్‌ను ఎదుర్కొనే సమయంలో అనుభవం లేని యువ ఆటగాడిని ఓపెనర్‌గా పంపడం పెద్ద తప్పిదంగా మారింది. తొలి మ్యాచ్‌లోనే విఫలం కావడంతో జట్టు ఒత్తిడిలో పడిపోయింది. సీనియర్ ఆటగాళ్లను ముందుగా పంపాల్సిందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ తరహా నిర్ణయాల వల్లే జట్టు అగ్రస్థానం నుంచి కిందకు జారిందని చెబుతున్నారు. ఇక రాజస్థాన్ జట్టు పరిస్థితి కూడా భిన్నంగా లేదు. భారీ స్కోరు చేసినప్పటికీ సరైన బౌలింగ్ వ్యూహం లేక ఓటమిని చవిచూసింది. ప్రధాన స్పిన్నర్లను పూర్తిగా వినియోగించకపోవడం, అనవసరంగా ఎక్కువమంది బౌలర్లను ప్రయోగించడం జట్టుకు ప్రతికూలంగా మారింది. కీలక సమయాల్లో అనుభవజ్ఞులైన బౌలర్లపై విశ్వాసం చూపకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. మరోవైపు లక్నో జట్టు సూపర్ ఓవర్‌లో చేసిన తప్పులు జట్టును ముంచేశాయి. ఫామ్‌లో లేని ఆటగాడిని ఓపెనింగ్‌కు పంపడం, కీలక సమయంలో సరైన బౌలర్‌ను ఉపయోగించకపోవడం మ్యాచ్ ఫలితాన్ని మార్చేసింది. ఇలాంటి చిన్న వ్యూహపరమైన పొరపాట్లు కూడా పెద్ద నష్టాన్ని కలిగిస్తాయని ఈ మ్యాచ్ స్పష్టంచేసింది. మొత్తంగా చూస్తే, మైదానంలో ఆటగాళ్ల ప్రతిభ ఎంత ముఖ్యమో, సారథి తీసుకునే నిర్ణయాలు అంతకంటే కీలకం. పరిస్థితులకు అనుగుణంగా సరైన వ్యూహం లేకపోతే ఎంతటి బలమైన జట్టైనా పరాజయం తప్పదని ఈ సీజన్ మరోసారి నిరూపిస్తోంది.



## నిజాయితీగా ఉండండి

### విద్యార్థులకు కోహ్లీ సందేశం

**న్యూఢిల్లీ:** విద్యార్థులు నిజాయితీ, నిబద్ధతతో తమ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని భారత క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ సూచించారు. మంగళవారం న్యూఢిల్లీలోని ఆర్కే పురం పాఠశాలలో నిర్వహించిన క్రికెట్ శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశం అందించారు. చదువును గౌరవించాలని, పాఠశాల జీవితం వ్యక్తిత్వ వికాసానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి తన పాఠశాల అనుభవాలను గుర్తు చేసుకున్న కోహ్లీ, క్రికెట్‌ను తన జీవిత లక్ష్యంగా ఎంచుకున్న తర్వాత పాఠశాల వాతావరణానికి చాలా త్వరగా దూరమయ్యానని చెప్పారు. పాఠశాలల్లో మాట్లాడే అలవాటు పెద్దగా లేకపోవడంతో ఇలాంటి వేదికలపై మాట్లాడటం కొంత ఇబ్బందిగా అనిపిస్తుందని వెల్లడించారు. అయితే విద్యార్థులతో తన అనుభవాలను పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల అనేది కేవలం పాఠాలు నేర్చుకునే స్థలం మాత్రమే కాదని, మంచి మనిషిగా ఎదగడానికి బలమైన పునాది అని ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ఎంతో కష్టపడతారని, వారి సేవలను ఎప్పటికీ మర్చిపోవద్దని సూచించారు. తమ జీవితంలో ఒక భాగాన్ని విద్యార్థుల అభివృద్ధి కోసం అంకితం చేసే ఉపాధ్యాయుల పట్ల ఎల్లప్పుడూ గౌరవభావంతో ఉండాలని కోహ్లీ విద్యార్థులకు సూచించారు.

# ప్లేఆఫ్స్ పోరు హోరాహోరీ

- టాప్-4లో పంజాబ్, ఆర్‌సీబీ జోరు!
- అగ్రస్థానంలో పంజాబ్ కింగ్స్.. ఒత్తిడిలో చెన్నై, ఢిల్లీ జట్లు
- ముంబై, కోల్‌కతా ఆశలు ఆవిరి..
- ఉత్కంఠ రేపుతున్న పాయింట్ల పట్టిక

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్ లీగ్ దశ సగం ముగియడంతో ప్లేఆఫ్స్ బెర్తుల కోసం పోరాటం క్లైమాక్స్ దశకు చేరుకుంది. ఇప్పటివరకు జరిగిన మ్యాచ్‌ల సరళిని బట్టి చూస్తే పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తమ ఆధిపత్యాన్ని చాటుతూ పాయింట్ల పట్టికలో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచాయి. సాధారణంగా ప్లేఆఫ్స్ చేరడానికి అవసరమైన 16 పాయింట్ల మార్కును చేరుకోవడంలో ఈ నాలుగు జట్లు ప్రస్తుతం ముందంజలో ఉన్నాయి. ముఖ్యంగా శిఖర్ ధావన్ సేన పంజాబ్ కింగ్స్ ఆడిన 7 మ్యాచ్‌లలో 6 విజయాలతో దాదాపు ఒక అడుగు ప్లేఆఫ్స్‌లో వేసింది. మిగిలిన మ్యాచ్‌లలో మరో రెండు గెలిచినా ఆ జట్టు అధికారికంగా క్వాలిఫై అవుతుంది.




ఆర్‌సీబీ కూడా అదే జోరును కొనసాగిస్తూ ప్లేఆఫ్స్ రేసులో పటిష్టంగా కనిపిస్తోంది.


### హైదరాబాద్, రాజస్థాన్ జట్ల ధీమా

స్థిరత్వానికి మారుపేరుగా నిలుస్తున్న రాజస్థాన్ రాయల్స్ మరియు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు కూడా ప్లేఆఫ్స్ బెర్త్ ఖాయం చేసుకునే దిశగా సాగుతున్నాయి. ఈ రెండు జట్లు మిగిలిన మ్యాచ్‌లలో కనీసం మూడు విజయాలు సాధిస్తే టాప్-4లో తమ స్థానాలను సురక్షితం చేసుకునే అవకాశం ఉంది. హైదరాబాద్ బ్యాటర్లు భీకర ఫామ్‌లో ఉండటం, రాజస్థాన్ బౌలింగ్ విభాగం రాణిస్తుండటం ఆయా జట్లకు కలిసొచ్చే అంశం. అయితే గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మరియు ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు మాత్రం గందరగోళంలో ఉన్నాయి. ప్రతి మ్యాచ్ ఈ జట్లకు చావోరేవో అన్నట్లుగా మారడంతో, లీగ్ రెండో భాగంలో ఈ జట్లు అసాధారణ ప్రదర్శన చేస్తే తప్ప ప్లేఆఫ్స్ చేరడం కష్టంగా కనిపిస్తోంది.

### మాజీ ఛాంపియన్లకు నిరాశేనా?

లీగ్ చరిత్రలో అత్యధిక సార్లు టైటిల్ గెలిచిన ముంబై ఇండియన్స్ మరియు కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లకు ఈ సీజన్ కలిసిరావడం లేదు. పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉన్న ఈ జట్లతో పాటు లక్నో సూపర్ జెయింట్స్ పరిస్థితి కూడా దారుణంగా ఉంది. ముంబై ఇండియన్స్ వరుస ఓటములతో అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. ఈ జట్లు ప్లేఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లోనూ భారీ తేడాతో విజయం సాధించాల్సి ఉంటుంది. ఒకవేళ ఏ ఒక్క మ్యాచ్ ఓడినా ఈ జట్లు టోర్నీ నుంచి నిష్క్రమించడం ఖాయంగా కనిపిస్తోంది. మొత్తానికి ఐపీఎల్ 2026 సెకండ్ హాఫ్ మరింత ఉత్కంఠగా సాగనుండటంతో ప్రతి బంతి, ప్రతి రన్ ప్లేఆఫ్స్ సమీకరణాలను మార్చేలా ఉన్నాయి.

## విమర్శలే బలం: శ్రేయస్



**న్యూఢిల్లీ:** ఒకప్పుడు కేవలం వన్డే ఫార్మాట్‌కే పరిమితం అవుతాడన్న విమర్శలను చెదరగొడుతూ భారత క్రికెటర్ శ్రేయస్ అయ్యర్ సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ సారథిగా జట్టును ముందుండి నడిపించడమే కాకుండా, క్రీజులోకి వచ్చేసరికి మ్యాచ్‌ను ముగించే ఫినిషర్‌గా తనలోని కొత్త కోణాన్ని ప్రదర్శిస్తున్నాడు. కష్టకాలంలో ఎదురైన విమర్శలే తనను మరింత దృఢంగా మార్చాయని అయ్యర్ పేర్కొన్నాడు. తన బ్యాటింగ్‌ను మెరుగుపరుచుకునేందుకు అయ్యర్ కఠిన సాధన చేస్తున్నాడు. ప్రతి ప్రాక్టీస్‌లో సుమారు 300 బంతులను ఎదుర్కొంటూ, ఆధునిక క్రికెట్ దిగ్గజాలు అయిన ఏబీ డివిలియర్స్, రోహిత్ శర్మ మరియు విరాట్ కోహ్లీ ల ఆటతీరును అనుసరిస్తున్నట్లు వెల్లడించాడు. మైదానంలో వారి ఏకాగ్రత, షాట్ ఎంపికలను గమనిస్తూ తన ఆటను మరింత మెరుగుపరుచుకున్నానని తెలిపాడు. "గతంలో నాపై వచ్చిన విమర్శలు, అవమానాలను నేను ఇంధనంగా మార్చుకున్నాను. నన్ను నేను నిరూపించుకోవడమే నా లక్ష్యం" అని అయ్యర్ ధీమా వ్యక్తం చేశాడు. ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఆయన, రాబోయే టీ20 ప్రపంచకప్‌లో కూడా తన స్థానాన్ని బలపరుచుకునే దిశగా అడుగులు వేస్తున్నాడు.


సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 29.04.2026
www.mudranews.in | @mudranews



గౌతమ బుద్ధుడి సూచనలు

బాధ్యతను నిర్వర్తించండి. ఫలితంపై ఆశ పెట్టుకోకండి. ఇది నిజమైన ప్రశాంత జీవన రహస్యం





## పండుగాడి జర్నీకి 20ఏళ్లు

### పోకిరీ విడుదలై రెండు దశాబ్దాలు

తెలుగు చలనచిత్ర చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించి, బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టించిన 'పోకిరి' చిత్రం సరిగ్గా 20 వసంతాలను పూర్తి చేసుకుంది. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం ఇదే రోజున 2006 ఏప్రిల్ 28న విడుదలైన ఈ సినిమా, అప్పటి వరకు ఉన్న తెలుగు సినిమా బాక్సాఫీస్ లెక్కలను పూర్తిగా మార్చివేసింది. ఈ చిత్రం సూపర్ స్టార్ మహేష్ బాబును మాస్ ప్రేక్షకులకు అత్యంత చేరువ చేయడమే కాకుండా, ఆయనను తిరుగులేని పవర్‌హౌస్‌గా నిలబెట్టింది. డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ మార్క్ మేకింగ్, పదునైన సంభాషణలు మరియు మహేష్ బాబు అల్ట్రా మోడ్రన్ లుక్ కలిసి వెండితెరపై ఒక మ్యాజిక్ చేశాయి. దాదాపు రూ.12 కోట్ల పరిమిత బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం, ఏకంగా రూ.66 కోట్లకు పైగా వసూళ్లను సాధించి అప్పట్లో 'ఇండస్ట్రీ హిట్'గా రికార్డు సృష్టించింది. కేవలం వసూళ్ల పరంగానే కాకుండా, సాంకేతికంగానూ ఈ చిత్రం సరికొత్త ప్రమాణాలను నెలకొల్పింది. ముఖ్యంగా మణిశర్మ అందించిన అద్భుతమైన స్వరం తం, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ప్రతి థియేటర్లో వైబ్రేషన్స్ పుట్టించాయి. హీరోయిన్ ఇలియానాకు ఈ సినిమా ఓవర్ నైట్ స్టార్‌డమ్ తీసుకురాగా, విలన్‌గా ప్రకాష్ రాజ్ నటన సినిమాకు ప్రాణం పోసింది. సినిమా ప్రథమార్ధం అంతా పండుగాడు అనే ఒక సాధారణ లోకల్ రౌడీగా కనిపించిన మహేష్ బాబు, క్లైమాక్స్ వచ్చేసరికి కృష్ణ మనోహర్ అనే అండర్ కవర్ ఐపీఎస్ ఆఫీసర్ అని రివీల్ అయ్యే సీన్ ప్రేక్షకులకు ఊహించని థ్రిల్ ఇచ్చింది. ఈ ఒక్క ట్విస్ట్ అప్పట్లో థియేటర్లలో సంచలనం సృష్టించడమే కాకుండా, సినిమాను మళ్ళీ మళ్ళీ చూసేలా ప్రేక్షకులను ప్రోత్సహించింది. 'ఎవడు కొడితే దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అవుతుందో వాడే పండుగాడు', 'ఒకసారి కమిట్ అయితే నా మాట నేనే విన‌ను' వంటి డైలాగులు నేటికీ తెలుగు ప్రేక్షకుల నాలుకలపై నానుతూనే ఉన్నాయి. ఈ సినిమా క్రేజ్ కేవలం టాలీవుడ్‌కే పరిమితం కాకుండా, తమిళంలో విజయ్ హీరోగా, హిందీలో సల్మాన్ ఖాన్ హీరోగా, కన్నడలో దర్శన్ హీరోగా రీమేక్ అయ్యి అక్కడ కూడా ఘనవిజయాలను అందుకుంది. 'పోకిరి' 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహేష్ బాబు అభిమానులు సోషల్ మీడియాలో భారీ ఎత్తున వేడుకలు జరుపుకుంటున్నారు.




## మా ఇంటి బంగారం ప్రమోషన్స్

### ఇంకా మొదలు పెట్టని నటి సమంత

ఈ మధ్య కాలంలో ప్రేక్షకులను మెప్పించడం చాలా కష్టంగా మారింది. ఒకప్పుడు స్టార్ హీరో, స్టార్ హీరోయిన్ సినిమా వస్తోంది అంటే చాలు.. అది ఎలా ఉన్నా కూడా ఫ్యాన్స్ హిట్ చేసేవారు. కానీ, ఇప్పటి జనరేషన్ అలా కాదు. ఎంత పెద్ద స్టార్ అయినా సరే కంటెంట్ ఉంటేనే హిట్ చేస్తున్నారు. కంటెంట్ తో పాటు ప్రమోషన్స్ ని కూడా లెక్కలోకి తీసుకుంటున్నారు. అందుకే ఈ మధ్య స్టార్ హీరోలు సైతం సరికొత్తగా ప్రచారాలు చేస్తూ తమ సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. అయితే తాజాగా స్టార్ హీరోయిన్ సమంత మాత్రం తన సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్ళలేకపోయారు అని టాక్ నడుస్తోంది. టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత నటిస్తోన్న తాజా చిత్రం మా ఇంటి బంగారం. నందినిరెడ్డి దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రాన్ని సామ్ భర్త రాజ్ నిడిమోరు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మే 15 న ఈ చిత్రం రిలీజ్ కు సిద్ధమవుతోంది. రిలీజ్ ఇంకా పట్టుమని 15 రోజులు కూడా లేదు.. కానీ, ఇప్పటివరకు ఈ సినిమా ప్రమోషన్స్ మొదలుపెట్టలేదు. ఒకప్పుడు సామ్ సినిమా రిలీజ్ అంటే ఆ బజ్ వేరే లెవెల్ లో ఉండేది. కానీ, ఇప్పుడు అలా లేదు. రాజ్ నిడిమోరుతో పెళ్ళి తరువాత సామ్ ఒకపక్క నిర్మాతగా.. ఇంకోపక్క హీరోయిన్ గా చేస్తున్న సినిమా మా ఇంటి బంగారం. ఓ బేబీ లాంటి హిట్ తరువాత సామ్- నందినిరెడ్డి కాంబోలోవస్తోన్న చిత్రం కావడంతో ఓ రేంజ్ లో బజ్ ఉంటుంది అనుకున్నారు. అయితే సామ్ మాత్రం ప్రమోషన్స్ చేయడంలో విఫలమయ్యారు అని చెప్పొచ్చు. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి ఒక్క ప్రమోషన్ ఇంటర్వ్యూ తప్ప ఇంకేమి రాలేదు. వెన్నెల కిషోర్ - సామ్ ఇంటర్వ్యూ రిలీజ్ అయినా కూడా అదేమీ అంతగా ఆసక్తి రేకెత్తించలేదు అని టాక్. అందుకనే ప్రేక్షకులు సైతం మా ఇంటి బంగారం సినిమాను పట్టించుకోవడం లేదని అంటున్నారు. మరి ఇప్పటికైనా సామ్ ప్రమోషన్స్ ను వేగవంతం చేసి ప్రేక్షకుల్లో ఆసక్తి కలిగించకపోతే సినిమాపై ఆశలు వదులుకోవాల్సిందే అని పలువురు చెప్పుకొస్తున్నారు.

## అషు రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్

పెళ్లి పేరుతో మోసం చేసి ఎన్ఆర్ఐ ధర్మేంద్ర నుంచి భారీగా డబ్బులు తీసుకున్నట్లు నమోదైన కేసులో సినీ నటి అషు రెడ్డికి సంబంధించిన ఆడియో రికార్డింగ్స్ లీక్ కావడం సంచలనంగా మారింది. ఇప్పటికే ఈ వ్యవహారంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. తాజాగా బయటకు వచ్చిన కాల్ రికార్డింగ్స్‌లో ధర్మేంద్రకు డబ్బులు తిరిగి ఇస్తానని చెబుతూ హెచ్చరికలు చేసినట్లు వినిపిస్తున్నట్లు సమాచారం. తాను తీసుకున్న మొత్తంలో కోటిన్నర రూపాయలు మాత్రమే ఇప్పుడే ఇస్తానని, మిగిలిన డబ్బులు తర్వాత ఇస్తానని చెప్పినట్లు తెలుస్తోంది. తన మాట వినకపోతే వేధింపుల కేసులు పెడతానని కూడా హెచ్చరించినట్లు ఆ ఆడియోల్లో వినిపిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదేవిధంగా మధ్యవర్తుల ద్వారా రాజీ చేసుకుందామని సూచించిన మాటలు కూడా ఆ రికార్డింగ్స్‌లో ఉన్నట్లు సమాచారం. ఈ ఆడియోల లీక్‌తో కేసు మరింత చర్చనీయాంశంగా మారగా, పోలీసులు ఈ వ్యవహారాన్ని పలు కోణాల్లో పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.



## లుక్ టెస్ట్ పూర్తయ్యింది

### చిరు -బాబీ కాంబినేషన్‌లో మూవీ

అగ్ర కథానాయకుడు చిరంజీవి ఫుల్ జోష్‌లో ఉన్నారు. వరుస చిత్రాలతో అలరించేందుకు సిద్ధమవుతోన్న ఆయన తాజాగా కొత్త ప్రాజెక్ట్‌కు సంబంధించిన లుక్ టెస్ట్‌ను పూర్తి చేశారు. బాబీ దర్శకత్వంలో చిరంజీవి హీరోగా రెండో సినిమా రానున్న విషయం తెలిసిందే. మెగా 158గా ఇది ప్రచారంలో ఉంది. ఈ సినిమా అప్‌డేట్‌ను దర్శకుడు పంచుకున్నారు. ఈ రోజు లుక్‌టెస్ట్ పూర్తయిందని.. త్వరలోనే షూటింగ్ ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. చిరు ఫొటోషూట్‌కు సంబంధించిన ఫొటోను షేర్ చేస్తూ 'హింసకు ముందు నిశ్శబ్దం' అనే క్యాప్షన్ రాశారు. దీంతో భారీ స్థాయి యాక్షన్ చిత్రంగా ఇది రానున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి - బాబీ కాంబినేషన్‌లో గతంలో 'వాల్తేరు వీరయ్య' రూపొందింది. 2023లో వచ్చిన ఈ చిత్రం మంచి ఆదరణను సొంతం చేసుకోవడంతో వీరి రెండో సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. ఈ ఏడాది 'మన శంకర వరప్రసాద్ గారు'తో హిట్ అందుకున్న చిరంజీవి మూడు సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'విశ్వంభర' ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సోషియో ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్‌తో పాటు శ్రీకాంత్ ఓదెల చిత్రం లైనప్‌లో ఉంది.





## మైఖేల్ మూవీ వసూళ్ల సునామీ

దివంగత పాప్ స్టార్ మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ప్రతిష్టాత్మక బయోపిక్ 'మైఖేల్' బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది. విడుదలైన అతి తక్కువ కాలంలోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రికార్డులను తిరగరాస్తూ అంతర్జాతీయ స్థాయిలో సెన్సేషన్ సృష్టిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రూ.2000 కోట్లు మిలియన్ల మార్క్‌కు చేరువలో ఉండగా, భారత మార్కెట్‌లోనూ మైఖేల్ జాక్సన్‌కు ఉన్న తిరుగులేని క్రేజ్‌ను చాటుతూ రూ.20 కోట్ల భారీ వసూళ్లను సాధించింది. కింగ్ ఆఫ్ పాప్ మ్యూజిక్, ఐకానిక్ డ్యాన్స్ మూమెంట్స్, ఆయన జీవితంలోని లోతైన సంఘర్షణలను దర్శకుడు ఆంటోనీ ఫుక్వా వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించడంతో అంతర్జాతీయ ప్రేక్షకులతో పాటు భారతీయ ప్రేక్షకులు కూడా ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతున్నారు. ముఖ్యంగా మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ పాత్రలో ఒదిగిపోయిన తీరుపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఆయన బాడీ లాంగ్వేజ్, డ్యాన్స్ విన్యాసాలు చూస్తుంటే సాక్షాత్తు మైఖేల్ జాక్సనే మళ్లీ తిరిగి వచ్చారా అన్నట్లుగా ఉందని విమర్శకులు సైతం కొనియాడుతున్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com